# పరమగీతము



T. P. వర ప్రసాద రెడ్డి

# పరమ గీతము

రచయిత :

**టి.పి. వరప్రసాదరెడ్డి,** *B.E.,*

ప్రచురణకర్త :

**పి. అబ్రహాము,** *Rtd. M.R.O.*

డోర్ నెం. 13/285, రెవిన్యూ కాలనీ,

**అనంతపూర్ - 515 001**

ఫోన్ : 77493, 77551.

ప్రథమ ముద్రణ : అక్టోబర్ - 2002

2000 ప్రతులు

**వెల : రూ. 15-00**

*No part of our publications may be reprinted without our written permission*

Designed & Type Setting : **Logos Graphics,**
10/1 Arundelpet, GUNTUR. Ph : 643743

SUDARSAN PRINTERS, 0863 - 2246245

# పరమగీతము

## గ్రంథ విభజన

1. 1-4 అధ్యాయములు : పాత నిబంధన కాలము.
2. 5-6 అధ్యాయములు : సంఘకాలము
3. 7-8 అధ్యాయములు : 1. ఆకాశమండలంలో సంఘానికి తీర్పుకాలము
   2. వెయ్యేండ్ల కాలము
   3. నిత్యకాలము (గా పోల్చిన విభజన)

### 1వ. అధ్యాయము

వచనముల విభజన - 8+8=16వ.

1. 1-8 వచనములు : ప్రియుడైన మందకాపరి - వేరు ప్రియుడైన సొలొమోనుతో రాజనగరులో షూలమ్మీతి.
   : (లోకాశలను జయించిన భక్తులకు పోలిక)
2. 9-16 " : భోజన బల్ల దగ్గర రాజైన సొలొమోనుతో షూలమ్మీతీ (శరీరాశలను జయించిన భక్తులకు పోలిక)

### 2వ. అధ్యాయము

వచనముల విభజన - 7+7+3=17వ.

1. 1-7 వచనములు : ప్రియురాలి వర్ణన, వేరు ప్రియుని వర్ణన, ప్రియుని వర్ణన.
2. 8-14 " : ప్రియుని స్వరము వినిన ప్రియురాలు, (యెహోవా వాక్కు ప్రత్యక్షమగుట)
3. 15-17 " : షూలమ్మీతీ ఇంటివారి తోటలు, ప్రియుని పైనే మనసుంచిన షూలమ్మీతీ.

## 3వ. అధ్యాయము

వచనముల విభజన - 5+6=11వ.

1. 1-5 వచనములు : పరుండి ప్రాణ ప్రియుని వెదకిన షూలమ్మితీ.
(దర్శనముల ద్వారా దేవుని వెదకినవారు)
2. 6-11 " : రాజైన సొలొమోను ఘనతను లెక్కపెట్టని షూలమ్మితీ.
(రాజరికమును లెక్కచేయక ప్రభువును సేవించిన మోషేతో పోలిక)

## 4వ. అధ్యాయము

వచనముల విభజన - 6+5+5=16వ.

1. 1-6 వచనములు : ప్రియుడు ప్రియురాలిని గూర్చి పలుకుట
(మన విషయమై ప్రభువు ఇచ్చు సాక్ష్యముతో పోలిక)
2. 7-11 " : లెబానోను విడిచి సింహ వ్యాఘ్రగుహలపై పయనించిన షూలమ్మితీ.
(బబులోను గ్రీకురాజుల కాలంలోని భక్తులకు పోలిక)
3. 12-16 " : మూయబడిన ఉద్యానవనమైన షూలమ్మితీ.
(బబులోను చెరకాలములోని భక్తులకు పోలిక)

## 5వ. అధ్యాయము

వచనముల విభజన - 8+8=16వ.

1. 1-8 వచనములు : ఉద్యానవనానికి ఏ తెంచిన ప్రియుడు - నిద్రించిన ప్రియురాలు
(మొదట రాకడలో ఈ లోకానికి వచ్చిన ప్రభువు - నిద్రించిన నులివెచ్చని సంఘానికి పోలిక)
2. 9-16 " : ప్రియుని సంపూర్ణముగా ఎరిగి వర్ణించిన ప్రియురాలు
(చక్కని ఎదుగుదల గల సంఘానికి పోలిక)

## 6వ. అధ్యాయము

వచనముల విభజన - 3+4+6=13వ.

1. 1-3 వచనములు : యెరూషలేము కుమార్తెల ప్రశ్నలకు ప్రియురాలిజవాబు (సంఘ పరిచర్యకు పోలిక)
2. 4-7 " : ప్రియురాలిని వర్ణించిన ప్రియుడు (సంఘ విషయమై ప్రభువు ఇచ్చిన సాక్ష్యముతో పోలిక)
3. 8-13 " : ప్రియుని మాటలు - ప్రియురాలి మాటలు (సంఘ ప్రత్యేకత, పవిత్రత ప్రకటన ఫలములతోపోలిక)

## 7వ. అధ్యాయము

వచనముల విభజన - 6+3+4=13వ.

1. 1-6 వచనములు : షూలమ్మీతీ పై ప్రియుని తీర్పు (ఆకాశమండలంలో క్రీస్తు తీర్పుతో పోలిక)
2. 7-9 " : షూలమ్మీతీ, ప్రియుని ఐక్యత (సంఘమును క్రీస్తు వివాహమాడుట - గొఱ్ఱెపిల్ల వివాహముతో పోలిక)
3. 10-13 " : ప్రియునితో పల్లెలకు వెళ్ళుట (పరలోక పట్టణ ప్రవేశంతో పోలిక)

## 8వ. అధ్యాయము

వచనముల విభజన - 4+3+5+2=14వ.

1. 1-4 వచనములు : ప్రియునితో కలసి తల్లియింట యుండుట. (భూమిపై వేయేండ్ల పాలనకు పోలిక)
2. 5-7 " : షూలమ్మీతీ అరణ్య మార్గమున వచ్చుట (నూతన యెరూషలేము భూమిపైకి దిగివచ్చుటతో పోలిక)
3. 8-12 " : షూలమ్మీతీ గతకాల చరిత్ర
4. 13-14 " : ముగింపు.

# గ్రంథ పరిచయము

పరిశుద్ధ గ్రంథములో సొలొమోను విరచిత గ్రంథాలు మూడు పొందుపరచబడ్డాయి.

అవి :- 1. సామెతలు 2. ప్రసంగి 3. పరమగీతము

సొలొమోను యుక్త వయస్సు ప్రారంభములో దైవజ్ఞానముతో సామెతలు, మధ్య వయస్సులో జీవితానుభవముతో పరమగీతము, వృద్ధాప్యంలో దైవజ్ఞాన సంపూర్ణ జీవితానుభవ మేళవింపు ప్రసంగి గ్రంథను వ్రాసినట్లు తెలుస్తోంది.

సొలొమోను 1000కి పైగా గీతాలు వ్రాశాడు (1రాజు. 4:32) వీటన్నిటి కంటే పరమగీతము శ్రేష్ఠమైనది. ఇది ఒక రకమైన ప్రేమగీతము. పరమగీతము అంటే గీతములలో శ్రేష్ఠమైన గీతము, గీతాలకు గీతము అని అర్థము. అలాగే లోకములో ప్రభువులు అనబడే వారున్నారు. కాని ప్రభువులకు ప్రభువు, దేవాది దేవుడు యేసుక్రీస్తు ఒక్కడే.

ఈ గ్రంథములోని అందము, ఆకర్షణ, మధురము, మనోహరము మొదలగు ప్రేమపూరిత పదాలను మనకిచ్చు శ్రేష్ఠపూర్వక బహుమతులతో పోల్చవచ్చు. ఈ గ్రంథములోని భాష కొన్నిసార్లు అశ్లీలముగా ఉన్నట్లు అనిపించినా ఇందులోని సందేశాలు మన జీవితాలనెంతగానో ప్రభావితం చేస్తాయి.

ఈ గ్రంథంలో 8 అధ్యాయములు 116 వచనాలు కలవు. ప్రియుడు అనే పదం 33 సార్లు, ప్రియురాలు అనే పదం 10సార్లు వాడబడింది. ప్రియురాలు అను పదానికి అనుబంధంగా ప్రాణేశ్వరీ అనుపదం 7సార్లు, సహోదరి అని 6సార్లు, సుందరి అని 11 సార్లు వాడబడింది.

ఈ గ్రంథాన్ని వ్యాఖ్యాన కర్తలు ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిగా వ్యాఖ్యానిస్తారు. ప్రియుడు ప్రియురాలి సంబంధాన్ని కొందరు దేవునికి ఇశ్రాయేలుకు, కొందరు క్రీస్తుకు సంఘానికి పోలుస్తారు. అనేకులు ప్రియుని సొలొమోనుతో పోలుస్తారు. ప్రియుడు మన ప్రభువైన యేసుక్రీస్తు, ప్రియురాలు ఆయన బిడ్డలమైన మనమే అనునది అందరి ధ్యానాంశమై ఉంది.

పరమగీతం ఒక నాటకంలాగా అనిపిస్తుంది. ఈ నాటకంలోని ప్రియుడు ఒక మంద కాపరి. అలాగే వేరొక ప్రియుడు కూడా కనిపిస్తున్నాడు. అతడు సొలొమోను. సొలొమోనే అసలైన ప్రియుడని యేసుక్రీస్తుకు సాదృశ్యంగా ఉన్నాడని అనేకులు అంటారు. కాని సొలొమోను జీవితం చూస్తే ఆ ప్రియుడు సొలొమోను అనిగాని, సొలొమోను యేసుకు సాదృశ్యం అనిగాని చెప్పలేము.

ఎందుకంటే ద్వితి. 17:14-17 ప్రకారము ఇశ్రాయేలీయుల కోరిక చొప్పున దేవునిచే ఏర్పరచబడిన రాజు అనేక మందిని వివాహం చేసికొనకూడదు. ఇది దేవుని ఆజ్ఞ. కాని సొలొమోనుకు 700 మంది భార్యలు, 300 మంది ఉపపత్నులు ఉన్నారు. (1రా. 11:3) మొత్తం 1000 మంది భార్యలు. ధర్మశాస్త్రాన్ని మీరాడు. 40 సం. పాలనలో అనగా 14,400 రోజులలో 1000 మందిని సగటున 14 దినాలకొకరిని పెండ్లాడాడు. లోకాన్ని, శరీరాన్ని ప్రేమించాడు. అలాంటి సొలొమోనును యేసుప్రభువుతో పోల్చక, వేరొక ప్రియునితోను, ఈ లోకపు ప్రియులతోను ఈ గ్రంథంలో పోల్చుట జరిగినది.

కాబట్టి ఈ వ్యాఖ్యానంలో ప్రియుడు అంటే సొలొమోను కాక మందల కాపరియైన ప్రియుడు అని గమనించండి. ఈ మందల కాపరియైన ప్రియుడు యేసుక్రీస్తుకు పోలికగా ఉన్నాడు. ప్రియురాలు ఆయనను నమ్మిన బిడ్డలకు పోలికగా భావించడం జరిగింది. ఆదాము, హేబెలు, హనోకు మొదలగు భక్తులు మొదలుకొని ప్రభువును నమ్మిన వారినందరిని ప్రియురాలితో పోల్చడం జరిగింది.

1 నుండి 4 అధ్యాయాలలో ప్రియుడు వచ్చినట్లుగా కనబడడం లేదు కాని 5:1లో వచ్చినట్లుగా చూడగలం. మొదటి 4 అధ్యాయాలు ప్రియుడు యేసు ఈ లోకానికి రాకముందు దినములు అని చెప్పవచ్చు. క్రీ.పూ. 4000 సం.లలోని పాతనిబంధన గ్రంధములోని దేవుని బిడ్డలకు క్రీస్తుకు ఉన్న సంబంధము అని చెప్పవచ్చు. ప్రభువు ఈ లోకానికి రాకముందు పాత నిబంధన భక్తులకు యెహోవా వాక్కుగా యెహోవా దూతగా కన్పించేవాడు. దర్శనాలు స్వప్నాల ద్వారా దేవుడు మాట్లాడేవాడు.

4 అధ్యాయాలు 4000 సం.లు అనుకుంటే ఒక్కొక్క అధ్యాయము 1000 సం.ల కాలాన్ని సూచిస్తుంది. ఆ కాలంలోని భక్తులకు, ప్రభువుకు గల సంబంధాన్ని 1 నుండి 4 అధ్యాయాలలోని ప్రియునికి, షూలమ్మీతీకి గల సంబంధంతో పోల్చవచ్చు. పరమ 5:1 నా ఉద్యానవనమునకు నేను ఏతెంచితిని అనుట ప్రభువు మొదట రాకడను సూచించును. ఉద్యానవనము సంఘము. 5,6 అధ్యాయాలు క్రీస్తు శకములోని 2000 ఏండ్ల సంఘకాలమును సూచించును. 6:13లో షూలమ్మీతీని రమ్ము రమ్ము అని పిలిచినట్లుగా ప్రకటన 4:1లో రమ్ము అనే పిలుపు విన్పిస్తుంది. ఈ పిలుపు మన ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడలో పిలుపు. ఆయన సంఘాన్ని ఆకాశ మండలానికి రమ్మని పిలుచుచున్నాడు.

1 థెస్స 4:16 ప్రకారం పిలుపు తర్వాత సంఘం ఎత్తబడుతుంది. ప్రభువు దేవుని బూరతో పిలుస్తాడు, దిగివస్తాడు. ఆయనకు మనవలె ప్రత్యేక బూరలు అవసరం లేదు. ఆయన స్వరమే ఆయన బూర (ప్రక. 1:10) ఆయన పిలుస్తున్నాడు అంటే ప్రభువు యొక్క రెండవ రాకడ అని అర్ధము. 6వ అధ్యాయము చివర సంఘము ఎత్తబడుటకు సాదృశ్యముగా ఉంది. 7వ అధ్యాయము సంఘం ఎత్తబడిన తర్వాత ఆకాశమండలములో జరుగు విశ్వాసుల తీర్పుకు తదుపరి పరలోకం వెళ్ళుటకు సాదృశ్యంగా కనిపిస్తుంది.

7:1లో రాజకుమార పుత్రికా నీ పాదరక్షలతో నీ వెంత అందముగా నడుచుచున్నావు అను మాటలో ఆకాశమండలంలో సంఘానికి జరుగు తీర్పును చూడవచ్చు. 7:11లో నా ప్రియుడా లెమ్ము రమ్ము మనము పల్లెలకు పోదము గ్రామసీమలలో నివసింతము అన్న మాటలు పరలోక పట్టణానికి ఎక్కి వెళ్ళడాన్ని గ్రామసీమలలో నివసించుట పరలోక నివాసానికి సాదృశ్యంగా ఉంది. 8:1 నుండి 8:4 వరకు వెయ్యేండ్ల పాలనను సూచిస్తుంది. 8:5 నుండి 8:7 వరకు నూతన యెరూషలేమను సంఘమైన పెండ్లికుమార్తె భూమి పైకి వచ్చుటను సూచిస్తుంది. 116 అను సంఖ్య వివాహములలో బహుకరణాలకు సంబంధించినది. 116 వచనాలు గల ఈ గ్రంధమును పెండ్లికుమారుడైన క్రీస్తు సంఘమను పెండ్లికుమార్తెకిచ్చిన బహుమతి.

## 1వ. అధ్యాయము

విభజన :-

1. 1-8వ. లు ప్రియుడైన మంద కాపరితోను, వేరు ప్రియుడైన సొలొమోనుతోను షూలమ్మితీ.

(లోకాశలను జయించిన భక్తులకు పోలిక)

2. 9-16వ.లు భోజనపు బల్ల దగ్గర రాజైన సొలొమోనుతో షూలమ్మితీ.

(శరీరాశలను జయించిన భక్తులకు పోలిక)

**1-8 ప్రియుడైన మంద కాపరి - వేరు ప్రియుడైన సొలొమోను :-** ప్రియుడు మందల కాపరిగా కనబడుచున్నాడు. (7) షూలమ్మితీ షూలేము (షూనేము) పట్టణానికి చెందినది. (యెహో. 19:17) షూనేము అనగా విశ్రాంతి సమాధానము అని అర్థము. షూలమ్మితీ అనగా విశ్రాంతి నొందిన వ్యక్తి అని అర్థము. మత్తయి 11:28లో దేవుడు మనకు ఇవ్వగోరిన అనుభవము ఇదే.

రక్షింపబడిన తర్వాత దేవునితో ప్రభువుతో సంఘముతో సమాధానము కలిగి జీవించాలి. షూలమ్మీతీ అనే పేరుకు సంపూర్ణము, పరిపూర్ణము అనే అర్థము కూడా ఉన్నది. ప్రతి మనుష్యుని క్రీస్తు నందు సంపూర్ణునిగా చేసి ఆయన ఎదుట నిలువబెట్టవలెనని (కొలస్సీ 1:28) పౌలు కోరిక. అలాగు పరిపూర్ణులుగా సంపూర్ణులుగా ఈ లోకంలో జీవించాలి.

రాజు అంతఃపురంలోనికి నన్ను చేర్చుకొనెను. (1:4) అని షూలమ్మీతీ అంటున్నది. షూలమ్మీతీ ఇక్కడ రాజు అంతఃపురంలో ఉన్నది. ద్రాక్షతోట కావలి కత్తె అయిన పల్లెటూరి షూలమ్మీతీ రాజు అంతఃపురానికి ఎందుకు వెళ్ళింది ? ఎలా వెళ్ళింది ? ద్రాక్షావళ్ళులు చిగురించాయో లేదో ఆ తోటలో ఉన్న దాడిమ వృక్షాలు పూత పట్టాయో లేదో చూచుటకు తన వృక్షోద్యానమునకు వెళ్ళింది (6:11). ఆ సమయంలో ఘనులైన వారి రథాలు ఎదురయ్యాయి. వారు రాజు అంతఃపురంలోనికి షూలమ్మీతీని తీసుకువెళ్ళారు (6:12).

ఆ అంతఃపురంలో అనేకమంది కన్యకలున్నారు. ఆ రాజుకు అనేక మంది రాణులు కూడా ఉన్నారు (6:8). ఆ రాజు సొలొమోనే ! చూచుట చేత కన్ను తృప్తి పొందకున్నది అని చెప్పిన ఈయన (ప్రసంగి 1:8) తనకున్న రాణులు చాలనట్లు ఇతర కన్యకలను కూడా చూడడమే పనిగా ఎంచుకున్నాడు. ఈయన తన లెబానోను అరణ్యపు నగరుకు (1రా. 7:2) విహారానికై పోతూ వస్తూ ద్రాక్షతోట కావలికత్తెయైన షూలమ్మీతీని చూచాడు. నా హృదయాన్ని ఒకే చూపుతో వశపరచుకున్నావు. లెబానోను విడిచి నాతో రమ్మని ప్రేమను కుమ్మరించాడు. ఆమెను వర్ణించాడు. లెబానోను కంటే మించిన అమాన, శెనీరు, హెర్మోను పర్వతముల నగరుల (నేత్రాశ)కు ఆయన వర్ణణల (జీవపు డంబము)కు ఆమె లొంగిపోలేదు. చేసేది లేక తన పరివారంతో అంతః పురము లోనికి రప్పించుకొని బంధించాడు.

ఈ లోకాధికారియైన సాతాను కూడా ఈ లోకంలోని నేత్రాశ, శరీరాశ, జీవపు డంబముల ద్వారా విశ్వాసులను లోబరచుకొనుటకు పోరాడుచున్నాడు. వానితో సహవాసము చేయుటకు ఇష్టపడని మనలను మరోరకంగా లోక కార్యాలలో బంధించి ఉంచాడు. ఉద్యానవనాలు వీక్షిస్తూ ప్రియునికి దూరమై అంతఃపురంలో బంధీగా షూలమ్మితీ చిక్కింది. మనము మన ప్రియుడైన యేసుకు దూరమై ఈ లోక కార్యములలో నిమగ్నమై లోకాశలకు బంధీలుగా ఉండడం లేదా ?

పై విషయాలు మనసులో ఉంచుకుని, ఇక వచనం తరువాత వచనం ధ్యానిద్దాం.

1వ. గ్రంధకర్త సొలొమోను అని తెలియుచున్నది.

2వ. సొలొమోను అంతఃపురంలో ఎన్నో ఉన్నాయి. వాటిచేత ఈమె ఆకర్షించబడలేదు. గాని, నీ ప్రేమ ద్రాక్షారసము కన్న మధురమని తన ప్రియుని గానము చేయుచున్నది. సొలొమోను అంతఃపురంలో ఎలాంటి కొదువలేదు. కోరినది తీసుకొనవచ్చును. శృంగార వనములు, గాయకులు, కన్యకలు, దాసదాసీలు, ఐశ్వర్యాలు, సంపదలు, సౌఖ్యాలతో ఎంతో రమ్యంగా ఆకర్షణీయంగా ఉంటుంది. (ప్రసంగి. 2:1-10) కాని, షూలమ్మితీ వాటిలో దేనిచేతను ఆకర్షించబడలేదు. దేనిని ప్రేమించలేదు. తన ప్రియుని ప్రేమిస్తున్నది. తన ప్రియునికి ప్రేమ గీతిక పాడుచున్నది. మనము మన ప్రియుడైన క్రీస్తు ప్రేమ గీతికను గానము చేయుదుము గాక.

3వ. నన్ను ఆకర్షించుము అని ప్రియురాలి పాట. ప్రియురాలు ప్రియుని చేత ఆకర్షించబడేదిగా ఉంది. అలాగే మన ప్రభువైన యేసుక్రీస్తు కూడా మనలను ఆకర్షించాడు. ఇంకా ఎందరినో ఆకర్షిస్తూనే ఉన్నాడు. యోహాను 12:32 ప్రకారము సిలువ వేయబడి, సమాధి చేయబడి, ఆరోహణము కావడము

్వారా మనలను పరలోకానికి ఆకర్షిస్తున్నాడు. ఆయన ప్రేమకు ఆకర్షితుల మైన మనం ప్రియురాలువలె ద్రాక్షారసముకన్న నీ ప్రేమను ఎక్కువగా స్మరించెదము అంటూ పాడాలి.

4వ. మనము ఆయన ప్రేమను ఎక్కువగా స్మరించుట ద్వారా లోక ఆకర్షణలను జయించవచ్చు. 1యో. 4:8లో దేవుడు ప్రేమా స్వరూపి. మనము ఆయనను ప్రేమించలేదు. ఆయనే మనలను ప్రేమించి తన ప్రియ కుమారుని ఈ లోకానికి పంపాడు అని ఉంది. షూలమ్మితీ తన ప్రియుని ప్రేమను స్మరించుచున్నందున సొలొమోనును కాని, అంతఃపురములోని దేనినిగాని ప్రేమించలేదు. ఎటువంటి నేత్రాశలు కూడా ఆమెను ఆకర్షించలేదు. మనము కూడా లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకూడదు. (1యో. 2:15-17) ఆయన ప్రేమనే స్మరించుచు జీవించాలి.

5వ. యెరూషలేము కుమార్తెలు అనగా యెరూషలేములో ఉండి రాజు నొద్ద పరిచర్య చేయువారు. కన్యకలను గూర్చి రాజుకు తెలిపేవారు. వీరు లోకమునకు సూచనగాను నామకార్థులకు సాదృశ్యంగాను ఉన్నారు. వీరు షూలమ్మితీని చిన్నచూపు చూచారు. అపుడు షూలమ్మితీ నేను నల్లని దాన నైనను నా ప్రియుని దృష్టికి సౌందర్యవంతురాలను. కేదారు వారి గుడారముల వలె ఉన్నానని పలికింది. కేదారు వారు అరేబియా ఎడారిలోని యాత్రికులు, సంచారకులు అంటే తాను యాత్రికురాలినని చెబుతున్నది. మనము కూడా యాత్రికులము, పరదేశులము (1పే. 2:9) కాని ఈ విషయము మరచి లోకమే స్థిరమని తలచి జీవిస్తూంటాము.

ఈమెను సౌందర్యవంతురాలు అని ఎవరు పిలిచారు ? ఆమె ప్రియుడే. నా సుందరీ అని పిలిచాడు. ఈమె నల్లనిదైనా ప్రియుని దృష్టికి సౌందర్య వంతురాలు. యెరూషలేము కుమార్తెలు షూలమ్మితీని తృణీకరించారు. లోకము కూడా మనలను తృణీకరిస్తుంది. కాని మన అంతరంగ సౌందర్య మును చూచిన మన ప్రియ ప్రభువు మనలను ప్రేమిస్తున్నాడు.

6వ. షూలమ్మితీ నల్లగా ఎందుకుంది ? నా సొంత తోట అనే మాటను, నన్ను ద్రాక్షాతోటలో కావలిగా ఉంచిరి అనే మాటను గమనించండి. ఆంగ్లములో తోటలు అని బహువచనం ఉంది. ఈమె సహోదరులు ఈమెను తన స్వంత ద్రాక్షతోటలో కాక, వేరే తోటలలో కాపలాగా ఉంచారు. వీరు ఈమె క్షేమాన్ని గాని, ఈమె సొంత తోట క్షేమాన్నిగాని పట్టించుకోలేదు. ఇలాంటి సహోదరులు నేటి మన సంఘాలలో కూడా ఉన్నారు. (కీర్తన 50:20; గలతీ 2:4.) కోపించే సహోదరులు, కపట సహోదరులు కూడా ఉన్నారు. ఈమెను వేరే తోటలో కాపలా ఉంచడం వల్ల ఆమె నల్లగా మారింది. శరీరము నల్లగా మారినా హృదయంలో ప్రియుని తలంపే. నల్లగా మారడాన్ని నీరసించి పోవడం, శక్తిని కోల్పోవడం అని అర్థము చేసుకోవచ్చు. అంటే ఆమె శక్తిని వేరే తోటలో కాపలాకు వినియోగించింది. తన సొంత తోటలకు కాదు. లూకా 11:40 లో మార్త అనేక పనుల వల్ల ప్రభువుతో సమయం గడపలేక పోయింది. ప్రభువు పనిలో వెనుకబడింది. షూలమ్మితీ తన సొంత తోటలు కాపు కాయ లేకపోయానని హృదయంలో ఆవేదన చెందింది. ఆశ అయితే ఉందిగాని వేరే తోటలు (వేరే పనులు) కలిగి తన తోటను చూచుకోలేక పోతున్నది. అలాగే మనము ఇతర పనులలో మునిగి మన ప్రియుడు, మన ప్రభువు వారి పనులను మనం చూడలేకపోవడం వలన ఆధ్యాత్మికముగా నీరసించిపోయి శక్తిని కోల్పోయే ప్రమాదం ఉంది. అనంతరం షూలమ్మితీలా విలపించడం మినహా ఏమీ చేయలేము. మన పనుల కంటే ఆయన పనులు ఉత్తమమైనవి. (లూకా 10:42) గనుక ప్రభువు పనుల కొరకు త్వరపడాలి.

7వ. నా ప్రాణ ప్రియుడా నీమందను నీవెచ్చట మేపుదువో.....నాతో చెప్పుము. కీర్తన 23:1. యోహ 10:14 ప్రకారము ఆయన మందను మేపు స్థలాలు రీతులు తెలిసి ఉండాలి. షూలమ్మితీ తన ప్రియుని మంద కాపరితో పోల్చుచున్నది. (1:8) మన తండ్రియైన యెహోవా మన కాపరి. మన ప్రభువైన క్రీస్తు మన మంచి గొఱ్ఱెల కాపరి. (యో. 10:11).

8వ. నారీ మణీ సుందరీ మందల అడుగుజాడలను బట్టి పొమ్ము. మంద కాపరుల గుడారముల యొద్ద నీ మేక పిల్లలను మేపుము. ప్రభువు పునరుద్ధానుడైన తరువాత పేతురుతో నీవు నన్ను ప్రేమిస్తున్నావా ? అని అడిగాడు. అవును ప్రభువా ప్రేమిస్తున్నాను అని పేతురు అన్నాడు. అయితే నా గొర్రె పిల్లలను మేపుము అని ప్రభువు అన్నాడు. (యో. 21:15-18) ఇది పేతురుకు మాత్రమే కాదు. క్రైస్తవ విశ్వాసులందరికి ప్రభువు అప్పగించిన బాధ్యత. సంఘాలలో, ఆఫీసులలో, కాలేజీలలో, పాఠశాలలో, పల్లెల్లో ఎటుచూసినా గొర్రెలే. వారిని మేపి పోషించే ఆధ్యాత్మిక బాధ్యత మనదే.

**2. 9-16వ. సొలొమోను - షూలమ్మితీ - ప్రియుడు :-** ఈ భాగంలో ఇద్దరు ప్రియులు ఉన్నారు. ఒకరు నిజమైన ప్రియుడు, మరొకరు లోకసంబంధమైన ప్రియుడు. గ్రంధ పరిచయములో చెప్పినట్లు అలా ధ్యానిస్తే మనం కొన్ని క్రొత్త పాఠాలు నేర్చుకోగలం.

9వ. నా ప్రియురాలా అని పిలుస్తున్నాడు. అంటే అతను నిజమైన ప్రియుడై ఉండాలి. కాని తర్వాత ఫరో రధాశ్వములలో నిన్ను పోల్చెదను అని అంటున్నాడు. దేవుడు ద్వితీ 17:16లో ఇశ్రాయేలీయులతో మీరు ఐగుప్తులోని ఫరో గుర్రాలుగాని, రధాలుగాని, తీసుకొనుటకై అక్కడికి వెళ్ళవద్దన్నాడు. ఎందుకు? మరలా ఇశ్రాయేలీయులు దేవుని మరచిపోతారని. అలాగే ఈ సొలొమోను తన స్వంత ప్రియుని మీద నుండి మనసు తొలగించాలని ఫరో యొక్క రధాశ్వరములతో నిన్ను పోల్చెదనని పొగడుచున్నాడు. దీని బట్టి ఈ ప్రియుడు లోకసంబంధి అని అతనే సొలొమోను అని అర్థమవుతోంది.

1రా. 10:28 ప్రకారము రాజైన సొలొమోను ఐగుప్తు నుండి గుఱ్ఱము లను తెప్పించుకొనుటను బట్టి వాటిపై ఆయనకున్న మక్కువ తెలుస్తోంది. అందుకే షూలమ్మితీని ఫరో రధాశ్వములతో పోల్చాడు.

కాబట్టి 9-12 వచనాల్లో మాట్లాడుచున్న ప్రియుడు లోకసంబంధియైన సొలొమోను (కాపరియైన ప్రియుడు కాడు) అతడు ఆమెను వశపరచుకోవాలని పొగడుచున్నాడు గాని ప్రియురాలు అతని తీరుమీద, అతను చూపే ప్రేమ మీద ఏ మాత్రం మనస్సు ఉంచలేదు. అతని మాటలకు లొంగిపోలేదు.

ఒకవేళ ఆమె సొలొమోను సంపదను ఆశించి లొంగిపోయి ఉంటే ఆమెను తన 700 మంది రాణులలో ఒక రాణిగా చేసుకునేవాడు. కానీ, షూలమ్మితీ వాటిని ఆశించలేదు. అలాగే మన ప్రియుడైన ప్రభువు మనలను కోరుచున్నాడు. మనలను కోరే లోకసంబంధమైన ప్రియుడు అపవాది కూడ ఉన్నాడు. ఐగుప్తు వంటి ఆశలతో అపవాది మనలను ఆకర్షించాలని చూస్తుంటాడు.

ప్రియురాలికి దేవుడు ఇచ్చిన పోలిక ఉంది. మనందరిని కూడా దేవుడు తన స్వరూపంలో తన పోలికలో సృజించాడు. కాని శోధకుడు దేవుడు ఇచ్చిన స్వరూపముతో కాక ఐగుప్తు రథాశ్వాలతో పోల్చుచున్నాడు.

10వ. వెండి, బంగారు ఆభరణములతో కాక...సత్క్రియలచేత మనలను మనము అలంకరించుకోవాలి. వెండి బంగారు ఛాయా రూపములు మాత్రమే (1తి. 2:10) అలాగే కంఠహారము సామె 1:9 ప్రకారము బోధకు గురుతు. సత్క్రియలు కలిగి అపోస్తలుల బోధకు లోబడి జీవించునదిగా ఈమె నుండి పాఠము మనము నేర్చుకోగలము. ఇక్కడ చెంపలను గూర్చి, కంఠమును గూర్చి, ఆభరణములను గూర్చి పొగడుచున్నాడు. అలా పొగడుట ద్వారా ఆమె మనస్సును గెలుచుకోవచ్చని అతని ఉద్దేశం.

[illegible] కూడా వెండి పువ్వులు గల బంగారు సరములు నీకు చేయిస్తానంటున్నాడు. ఆమెను బంగారు చేత లోకసంబంధమైన వాటిచేత శోధిస్తున్నాడు. చాలా పర్యాయములు ఆత్మీయులు కూడా బంగారమంటే

ఇష్టపడుతారు. సౌందర్యం కొరకు బంగారం చేత అలంకరించుకుంటారు. సుందరమైన మన అవయవములకు మరి ఎక్కువ సౌందర్యము అక్కరలేదు. (1కొ.12:24) దేవుడు మనలను సృజించినపుడు సుందరముగా చేశాడు. ఆయన ఇచ్చే సౌందర్యముతో తృప్తి చెందక, వేరే విధంగా సౌందర్యము కోరుకొంటాము. అలాగే సొలొమోను శోధిస్తున్నాడు. బంగారు నగల ఆశ జూపుతున్నాడు. ఎన్ని పర్యాయములు విశ్వాసులు శోధనకు లొంగి స్వంత ప్రియుడైన యేసును విడచిపెట్టలేదు ? బంగారు వంటి, శరీరాశలతోను అపవాది శోధించినపుడు షూలమ్మితీ వలె లొంగకూడదను పాఠము నేర్చుకుందాము.

12వ. రాజు విందుకు కూర్చున్నాడు. సొలొమోను భోజనపు బల్ల చాలా విచిత్రమైనది. ఆయన భోజనపు బల్లతో మరి దేనిని పోల్చలేము. (1రా.4:22) ఈ భోజనపు బల్లపై రకరకాల ఆహార పదార్థాలున్నాయి. క్రొవ్విన ఎడ్లు, విడి ఎడ్లు, నూరు గొర్రెలు, ఇవిగాక ఎర్ర దుప్పులతో వంటకాలు, క్రొవ్విన బాతులు ఉన్నాయి. ఆయన బల్ల యొద్దకు వచ్చిన వారందరికి ఏమియు తక్కువకాదు. (1రా. 4:27).

యూఫ్రటీసు మొదలు ఐగుప్తునది వరకు ఆయన రాజ్యము విశాలమైనది. ఆ రాజ్యములోని 12 మంది అధిపతులకు ఆ భోజన బాధ్యత అప్పగించాడు. నెలకు ఒక్కొక్క అధిపతి ఈ రకరకాలైన వంటకాలకు పదార్థాలు పంపాలి. సొలొమోను షూలమ్మితీని అలాంటి భోజనము ద్వారా శోధిస్తున్నాడు. విందుశాలకు ఆమెను తీసుకువెళ్ళాడు.

సాధారణంగా రాజుల భోజనం అనగానే ఏ మానవుడైనా ఆకర్షించబడుతాడు. ఆమె అక్కడ కూర్చున్నది. ఆయన ఎదురుగా కూర్చున్నాడు. నా ప్రియుని దగ్గర ఇటువంటి ఆహారం లేదు. బంగారము లేదు. కనుక ఇక్కడే

ఉంటే బాగుంటుందని షూలమ్మితీ ఆశించవచ్చు. అలా ఆశించి ఉంటే ఏమి జరిగేది ? తరువాత సొలొమోను వేరొకరి మీద మనసు పడేవాడు.

13వ. నా ప్రియుడు నా రొమ్మున నుండు గోపరసమంత సువాసన గలవాడు. నా పరిమళ తైలము సువాసన గలది అంటున్నది. ఈమె సొలొమోను భోజనమును ఆశించలేదు. ఆ భోజనము ఆమెకు సువాసన ఇవ్వలేదు. ఆమె ప్రియుని పరిమళ తైలమే సువాసనగా ఉంది. ఆమెకు భోజనపు బల్ల సువాసనగాని మరి ఏదీ కూడా ఆమెను ఆకర్షించలేదు. షూలమ్మితీ సొలొమోను అంతఃపురములో భోజనపు బల్ల ఎదుట ఉన్నా తన ప్రియుని తలంచుకొనుట చూచి సొలొమోనుకు ఆశ్చర్యం కలిగింది. ఏమిటి ఈమె విశేషము అని అబ్బురపడ్డాడు. ఈ భాగంలో ప్రియురాలు నిజ ప్రియునికి దూరంగా ఉన్నది. లోకం ఆకర్షిస్తుంది. లోతును కూడా ఆకర్షించింది. లోకం చాలా మోసకరమైనది.

అంతఃపురము ఎంతో రమ్యముగా, ఆశ్చర్యముగా ఉంటుంది. అందు లోకజ్ఞానము చూడవచ్చు. లోకసంబంధంగా, శరీర సంబంధంగా సాతాను శోధిస్తాడు. కీర్తన 1:2; 42:8; రాత్రివేళ పగటివేళ మన ప్రియుడైన క్రీస్తును ధ్యానిస్తూ ఉండాలి.

గోపరసము అనునది ఒక దండలాగా మెడలో కట్టుకుంటారని వేదాంతులు అంటారు. ఎస్తేరు 2:12; సామె 7:17 చదివితే గోపరసము అనగా సువాసనగల చెట్టు అని అర్థమవుతుంది. భోళము అని అర్థము కూడా ఉంది. ఆత్మీయ పరిమళ సువాసన యేసుక్రీస్తులోనే ఉంది. ఆనాడు బాల యేసుకు జ్ఞానులు సువాసనగల భోళమును తీసుకువచ్చారు. అందుకే మరియ (తల్లి మరియ కాదు) ఆయన పాదముల మీద, ఆయన తల మీద సువాసన గల అత్తరు పూసినది. (యోహా. 12:3; మార్కు 14:3)



3

తన్ను తాను అప్పగించుకొనుట ద్వారా యేసు పరిమళ సువాసన అయ్యాడు. (ఎఫె. 5:2) ఆయన మన కొరకు నలిగిపోయాడు. ఆయన పొందిన దెబ్బల ద్వారా స్వస్థత మనకు కలిగింది. ఆయనే మన పరిమళ సువాసన. ఆయన పిల్లలమైన మనము పరిమళ సువాసనగా ఉన్నామా ?

14వ. నా ప్రియుడు అని మరలా జ్ఞాపకం చేసుకుంటున్నది. ఏన్గెదీ అనగా మృత సముద్రమునకు పడమర, నీటి ఊట ద్వారా ఏర్పడిన ఒక ఒయాసిస్సు. సారవంతమైన దేశము. దావీదు సౌలు వద్ద నుండి పారిపోయి ఎన్గెదీ వద్ద దాగుకొన్నాడు. ఎన్గెదీ అనుటలో ఆమెకు ఎంతసేపు తన ప్రియుని మీద ధ్యాసే. ద్రాక్షవనంలోని అంటున్నది. యోహాను 15 అధ్యాయంలో యేసు నేను ద్రాక్షావల్లిని అన్నాడు. గనుక మనకు మన ప్రియుని మీదే ధ్యాస ఉండాలి.

కర్పూర పూగుత్తులతో సమానుడు అని అన్నది. కర్పూరము పవిత్రతకు గుర్తు (హెబ్రీ 7:26) ఈమె ప్రియుని పవిత్రతను జ్ఞాపకం చేసుకుంటున్నది మన ప్రభువు పరిశుద్ధత ఎంత గొప్పది !

15వ. తన ప్రియుడు ఆమెను అభినందించుచున్నాడు. మన ప్రియుడైన యేసుక్రీస్తు మనలను అభినందిస్తున్నాడా ? మన మాటలు, చూపులు, ప్రవర్తన ఎలా ఉన్నాయి ? అభినంధించగలిగినవిగా ఉన్నాయా ?

8లో నారీమణీ సుందరీ అని పిలువబడింది. కానీ, 15లో సుందరీ, సుందరీ అని అంటున్నాడు. అధిక సౌందర్యం ఉందని పొగడుచున్నాడు. ఆమె కన్నులు గువ్వకండ్లు, ఈమె కన్నులు నిష్కాపట్యమైనవి. మానవులు పాపంలో పడుతున్నారంటే కారణం కన్నులే. నీ కన్ను తేటగా ఉంటే నీ దేహ మంతా (నీ జీవితమంతా) వెలుగే అని చెప్పబడింది. (మత్తయి 6:22) గువ్వలు జంటలుగా ఉంటాయి కానీ, కొన్ని గువ్వలు ఒంటరిగా ఉండి (యెష. 59:11) దుఃఖరవం చేస్తాయి. ఆ గువ్వలు తమ భర్తలు చనిపోయిన తర్వాత మరి ఎవరితో చేరవట అని చరిత్రలో చూస్తాము. భర్తలు చనిపోయినా మిగిలిన కాలమంతా పవిత్రతను కాపాడుకుంటాయి.

ఆలాగే మనమూ జీవిత కాలమంతా నమ్మకముగా ఉండాలి. మన ప్రియుడు చనిపోయాడు. తిరిగి లేచాడు. ఒకరోజు వస్తాడు. ఆయన వచ్చే సరికి దుఃఖరవము అనగా ప్రార్థనా జీవితమును కలిగి ఉండాలి. ప్రార్థన మన జీవితాలలో ముఖ్యమైనది. ప్రార్థనలో అపవాది మనలను ముందుకు పోనివ్వడు. అందుకే ఆత్మీయులు ఓడిపోతారు. కన్నీటితో చేసిన ప్రార్థనను దేవుడు జ్ఞాపకం చేసుకొనును. నా కన్నీటితో నా పరుపు కొట్టుకొని పోతుందని దావీదు అంటున్నాడు. (కీర్తన 6:6)

16వ. ప్రియుడు దగ్గర లేడు. అయితే ప్రియుని గూర్చి నా ప్రియుడా నీవు సుందరుడవు అంటున్నది. ఎదురుగా సొలొమోను ఉన్నప్పటికి అతనిని ఆమె చూడలేదు. మనము కూడా లోకములోనికి వెళ్ళితే లోకం రమ్యంగా, సుందరంగా, ఎంతో ఆకర్షణీయంగా కనబడుతుంది. దానిని మించి మన ప్రభువు సుందరమైన వాడుగా కనబడుచున్నాడు.

మన శయన స్థానము పచ్చని చోటు. సొలొమోను శయన స్థానము రాజ విలాసానికి గుర్తు. సొలొమోనుకు సౌందర్యమైన గదులు ఉన్నాయి. కానీ, ఆమె పట్టించుకోలేదు. పచ్చని చోటు గొఱ్ఱెల కాపరి తిరుగు స్థలానికి గుర్తు. అందుకే పచ్చని చోటు గురించి చెబుతున్నది. ఇది ఆమె పరిశుద్ధ ప్రేమకు తార్కాణము. పచ్చిక బయలు దైవవాక్యానికి కూడా గుర్తు.

దేవదారు, సరళపు మ్రానులు గల ఇండ్లు సొలొమోనుకు ఉన్నాయి గాని, షూలమ్మీతీకి అవి గుర్తుకు రాలేదు. మందిరపు దూలములు గుర్తుకు వస్తున్నవి. చెట్టు ఏదైనా మనిషిని సూచిస్తుంది. (దాని. 4:22) దేవదారు అనేది చెట్లన్నిటిలోకి రాజులాంటిది. బాగా ఎదిగే చెట్టు. మనము బాగా ఎదిగే మందిరపు దూలములుగా మారాలి. సరళము అనగా సరైన జీవితము. వంకర లేనిది. క్రీస్తు యేసునందున్న సరళత నుండి మనము తొలగిపోకూడదు. (2కొ. 11:2,3).

మన మందిరాలలో దేవదారు మ్రానుల వంటి సంఘ పెద్దలు, విశ్వాసులు కావాలి. అపో. 17:4లో ఘనత గల స్త్రీలు అనేకులు నమ్మి సంఘములో చేర్చబడ్డారు. 1 థెస్స 1:7లో థెస్సలోనీక సంఘము మాదిరి చెప్పబడింది. సరళత, పవిత్రత గల సంఘముగా చూడగలము. మన సంఘాలు ఘనత గల వారితోను సరళత, పవిత్రత గల వారితోను నింపబడి ఉండాలి.

ముగింపు : ఈ అధ్యాయములో షూలమ్మీతీ సొలొమోను రాజనగరి వైపుగాని, ఆయన భోజనపు బల్లవైపుగాని, ఆకర్షింపబడక ప్రియునితో సహవాసంతో ఉన్నట్లు గమనించగలము. మొదటి సహస్రాబ్దిలోనున్న వారిలో హనోకు దేవునితో నడచినాడనియు, దేవునికి ఇష్టుడనియు సాక్ష్యము పొందెను. హెబెలు నీతిమంతుడని సాక్ష్యము పొందెను. లోకమునైనను లోకములో ఉన్న వాటినైనను ప్రేమించినవారు కారు. మనమును అలాగున లోకాశలను, శరీరాశలను జయించి జీవించుదుము గాక !

## 2వ. అధ్యాయము

విభజన :-

1. 1-7 వచనములు : ప్రియురాలి వర్ణన, వేరు ప్రియుని వర్ణన, ప్రియుని వర్ణన.
2. 8-14 " : ప్రియుని స్వరము వినిన ప్రియురాలు, (యెహోవా వాక్కు ప్రత్యక్షమగుట)
3. 15-17 " : షూలమ్మీతీ ఇంటివారి తోటలు, ప్రియుని పైనే మనసుంచిన షూలమ్మీతీ.

**1. 1-7వ. ప్రియురాలి వర్ణన, వేరు ప్రియుని వర్ణన, ప్రియుని వర్ణన :**

1వ. నేను షారోను పొలములో పూయు పుష్పము వంటిదానను. లోయలలో పుట్టు పద్మము వంటిదానను. పుష్పము అనగా రోజా పువ్వు.

పద్మము అనగా లిల్లీ పువ్వు. షారోను పొలము అంటే ఫలభరితమైన ఆకు పచ్చని మైదానము. యెష. 35:1 ప్రకారము ఇది ఒక అరణ్య ప్రాంతముగా చెప్పబడుతుంది. అరణ్యములో ఎదిగిన పువ్వుగా ఆమె తనను గూర్చి చెప్పుచున్నది. యెష. 14:17లో ఈ లోకాన్ని అపవాది అడవిగా చేశాడని చెప్పబడింది. అడవిలో రోజా చెట్టు మొలిచింది. ఏ సౌకర్యం లేకుండా ఎదిగింది. సంఘము ఎదుగవలసిన రీతి ఇదే. ఆత్మీయంగా ఈ లోకంలో మనకు ఏమీ లేదు. ఉండేది ఒక్కటే. అది సంఘ సహవాసము. సంఘములోనే మనము చక్కగా ఎదిగి రమ్యమైన రోజా పుష్పంలా మారుతాము.

2వ. బలురక్కసి చెట్లలో వల్లి పద్మము తెల్లగా కనబడునట్లు స్త్రీలలో నా ప్రియురాలు కనబడుచున్నది. బలురక్కసి చెట్లు అంటే ముళ్ళచెట్లు ముళ్ళ చెట్ల మధ్య ఏ చెట్లయినా ఎదగడం కష్టం. ఈమె బలు రక్కసి చెట్ల వంటి . మనుష్యుల మధ్య చక్కగా పెరిగింది. బలురక్కసి చెట్టువంటి చాలామంది స్త్రీలు ఉన్నారుగాని వీరికంటే ఈమె వల్లి పద్మంగా తెల్లగా ఉన్నది అని మంచి సాక్ష్యము ఇస్తున్నాడు. ఫిలి. 2:14. అలాగే మూర్ఖమైన వక్రజనముల వంటి అన్యుల మధ్యన నీ సాక్ష్యమెలాగున్నది ?

3వ. సొలొమోను గూర్చిన ప్రస్తావన లేదు. ఆమెను గూర్చి సొలొమోను అంతగా మాట్లాడినను ఆమెకు సొలొమోను గుర్తుకు రాలేదు. తన ప్రియుడు ఒక్కడే గుర్తుకు వస్తున్నాడు. జల్దరు చెట్టు అంటే ఆపిల్ చెట్టు. ఈ చెట్టు అడవిలో పుట్టేదికాదు. అయితే అడవి వృక్షముల మధ్య జల్దరు అని వర్ణించ బడినది. ప్రభువైన క్రీస్తు యేసు వారు కూడా అడవిలో పుట్టినట్లు అలంకారి కముగా యెష. 53:2 చెప్పబడెను. ఆయన ఈ జనారణ్యములో ఉండవలసిన వాడుకాడు కానీ, మన నిమిత్తమే ఆయన తగ్గించుకుని పరలోక మహిమను విడిచి సామాన్య నరునిగా జన్మించారు.

పురుషులలో నా ప్రియుడు అట్లున్నాడు. లోకంలో ఉన్న రాజులందరు

ఈ వృక్షాలవలె ఉన్నారు (దాని. 4:22) వీరందరి మధ్య రాజుల రాజైన యేసుక్రీస్తు వారు జల్దరు వృక్షముగా కనిపిస్తున్నారు. ఆయన నీడ క్రింద కూర్చున్నపుడు ఆనందం దొరికింది.

నీడ విశ్రాంతినిస్తుంది. ఎవరైన ఆయన నీడ క్రింద కూర్చున్నపుడు ఆనందము, విశ్రాంతి దొరుకుతుంది. ఉదా: మార్కు 5:15లో గదరేనీయుల దేశంలో స్వస్థచిత్తుడైనవాడు ఆనందముగా ప్రభువు నీడకు వచ్చాడు. లూకా 10:39లో మరియ ప్రభువు పాదాల యొద్ద కూర్చున్నది. మరియ మార్తకంటే ఆనందముగా ఉంది. ఆయన వద్దకు, ఆరాధనకు కూడివచ్చుట ఆనంద భరితులమై ఆయన నీడను కూర్చుండుటతో సమానము.

4వ. నా మీద ప్రేమను ధ్వజముగా ఎత్తెను. ప్రేమాతిశయము చేత నేను మూర్చిల్లుచున్నాను. నన్ను నేను మరచునంతటి ప్రేమ. అపారమైన ప్రేమ నాకు చూపించాడు. (1) యోహా. 3:16 (2) ఎఫె. 3:16, (3) 1యోహా. 3:16. (4) యిర్మి. 31:3, (5) యోహా. 13:1 (6) 1 యోహా. 4:8-10, (7) ప్రక. 1:6 ఆయన ప్రేమ గొప్పది. ఆమెను మూర్చిల్ల జేసే ప్రేమను చూపాడు.

అతడు నన్ను విందుశాలకు తీసుకుని వెళ్ళెను. ఇది సొలొమోను విందు శాల కాదు. ప్రియుని విందుశాల. (1) లూకా 14:12-24. రక్షణార్థమైన విందు. ఈ విందుకు అందరు ఆహ్వానితులే. (2) ప్రక. 19:1-10. ఆహ్వానం విని ప్రియుని చేయి పట్టుకున్న వారికే ప్రవేశం. ప్రియుడు నిన్ను విందుశాలకు పిలుచుకుని వెళ్ళుటకు రాబోతున్నాడు సిద్ధపడు.

5వ. ద్రాక్షపండ్ల అడలు పెట్టి నన్ను బలపరచుడి. ద్రాక్షచెట్టు జల్దరు వృక్షము మన ప్రభువైన యేసుక్రీస్తు వారే. బలపరచువాడు ఆయనే. ఆయనలో తప్ప లోకంలో ఎక్కడా (1) ఆనందము (2) విశ్రాంతి (3) ఆదరణ (4) మాధుర్యము (5) బలము (6) నిజమైన ప్రేమ దొరుకవు.

6వ. ప్రభువు యొక్క ఎడమ చేయి మన తల క్రింద ఉన్నది. కుడిచెయ్యి చేత ఆయన మనలను కౌగలించే దేవుడు. కోడి తన పిల్లలను రెక్కల క్రింద దాచినట్లు యెహోవా రెక్కల క్రింద నీవు సురక్షితముగా ఉందువు. (రూతు 2:12) ఈ వచనంలో కాపుదల భద్రత, బహుమానం మొదలైన అంశములు కలవు.

7వ. యెరూషలేము కుమార్తెలు కనిపించు చున్నారు. వీరు కలవరపరచు చున్నారు. (4వలైను) వీరు లోకస్థులు నామకార్థమైన మతస్థులు. వీరు ప్రభువు దృష్టి నుండి మనలను మళ్ళించుటకు ప్రయత్నించువారు. వీరే యెరూషలేము కుమార్తెలు.

## 2. 8-14వ. ప్రియుని స్వరము వినిన ప్రియురాలు

8. ప్రియుని స్వరము వినబడుచున్నది. పాత నిబంధన కాలంలో ప్రభువు వారికి కనిపించకపోయినా వారితో మాట్లాడాడు. రెండవ సహస్రాబ్ది చివర అనేక పర్యాయాలు అబ్రహాముతో యెహోవా తన వాక్కు ద్వారా మాట్లాడాడు. ఇదిగో అతడు వచ్చుచున్నాడు. పాతనిబంధన భక్తులు యేసుక్రీస్తు కొరకు ఎదురుచూచారు. ఇదుగో ఆయన వచ్చుచున్నాడు. (మలాకీ 3:1) అంటూ మలాకి ప్రవచించాడు. ఎందుకు వచ్చుచున్నాడు ? పాపులను రక్షించుటకు అన్నాడు పౌలు (1తిమో. 1:15) గంతులు వేయుచు వచ్చుచున్నాడు. (కీర్తన 40:8) "యేసు, నా దేవా నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము" అన్నాడు. తండ్రి కూడా ఈయన నా ప్రియ కుమారుడు ఈయన యందు నేను సంతోషించుచున్నాను అన్నాడు. కొండలమీదను, మెట్టలమీదను వచ్చు చున్నాడు. యెరూష లేము 7 కొండల మీద కట్టబడిన పట్టణము. (1) దావీదు పురము అను కోట గల కొండ (2) సీయోను కొండ (ఇందు మూడు కొండలు గలవు 2,3,4) 5. మోరియా పర్వతము 6. కల్వరి కొండ 7. ఒలీవల కొండ.

సువార్తలలో ఈ కొండలమీద ప్రభువైన యేసుక్రీస్తు తన జీవితమును గడిపినట్లుగా చూడగలము. వీటిని దాటి వచ్చిన ప్రియునివలె క్రీస్తు ఉన్నాడు.

9వ. ఇఱ్ఱి అనగా ఆడుజింక. దాని పిల్ల (బిడ్డ)ను వెంటబెట్టుకున్న జింకలాగా ప్రభువు తన శిష్యులతో సదాకాలము వుంటానన్నాడు. అదిగో మన గోడకు వెలిగా అతడు నిలుచుచున్నాడు. గోడ అనగా హృదయమని ప్రక. 3:20 అలంకారార్థము. కిటికీ గుండా చూచుచున్నాడు. ప్రక. 3:20లో తలుపు అనే పర్యాయపదము వాడబడింది. కిటికీ దాని. 6:10లో ప్రార్థనా జీవితానికి సాదృశ్యము. కొన్నిసార్లు ఆయన కిటికీ గుండా చూస్తుంటాడు. మనలను మన ప్రార్థనా జీవితాన్ని పరిశీలిస్తుంటాడు. (2దిన. 16:9)

10-11వ. ప్రియుడు మాట్లాడుచున్నాడు. లెమ్ము రమ్ము వర్షమిక రాదు. రెండవ సహస్రాబ్దిలో నోవహు కాలంలో జలప్రళయం తర్వాత ఆది. 8:21లో వర్షము ద్వారా భూలోకాన్ని ఇక నాశనము చేయను అన్నాడు. ఆది. 12:1, అపో. 7:2-3లో నీ స్వదేశము విడిచి నేను చూపించు దేశానికి రమ్మన్నాడు. ప్రభువు పిలుపుకు లోబడిన అబ్రహామును (ఆది. 12:8)లో చూడగలం.

వర్షాకాలము తీరిపోయెను. వర్షమిక రాదు. వర్షము దేవుని తీర్పుకు సూచన. వర్షము ఇక రాదు అంటే తీర్పు ఇక రాదు. ఈ వర్షమనే తీర్పు కలువరి శిలువలో ప్రభువు మీద వర్షించింది (శిక్ష పడింది). వర్షాకాలం తర్వాత చలికాలం. శిక్ష తరువాత మరణం. ఆయన మన స్థానంలో మరణించాడు. చలికాలము గడచిపోయింది. శిక్ష పొందిన తర్వాత మరణించాడు. తిరిగి లేచాడు. మరణం కూడా గడిచిపోయింది. అందుకే యోహా 5:24. నా మాట విని నన్ను పంపిన వాని యందు విశ్వాసముంచినవాడు నిత్యజీవం గలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటి ఉన్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను అన్నాడు.

12వ. పువ్వులు వసంత కాలానికి సూచన. పునరుద్ధానమునకు గుర్తు. ఉదా. అహరోను కర్ర పూలు పూయుట (సంఖ్యా. 17:8) క్రీస్తు పునరుద్ధానమును సూచిస్తున్నది. కోలాహలము చేయుట ఆరాధనకు గుర్తు పక్షులారా యెహోవాను స్తుతించండి. కీర్తన. 148:10-11. ఆత్మతో సత్యముతో ప్రభువును స్తుతిస్తారు అని సమరయ స్త్రీతో యేసు ప్రభువు అన్నాడు. (యోహా. 4:24)

13వ. అంజూరపు కాయలు, పూతపట్టిన ద్రాక్ష అబ్రహాము సంతానములో రాబోవు ఇశ్రాయేలు జనాంగాన్ని సూచిస్తున్నది. అబ్రహాము మంచి, సుందరమైన ఆత్మీయ జీవితం జీవించాడు.

14వ. బండ మన ప్రభువు యేసే. సందు అంటే తండ్రికి కుమారునికి మధ్య ప్రభువు చాటున జీవిత యాత్ర పూర్తిగా కొనసాగించి పావురమువలె నిష్కపటముగా జీవించాడు అబ్రహాము. మధురమైన అబ్రహాము స్వరమును ప్రభువు అబ్రహాము చేసిన ప్రార్థనలో విన్నాడు. (ఆది. 18) నీ ముఖము నాకు కనబడనిమ్ము నీ స్వరము నాకు వినబడనిమ్ము అంటే ఇందులో కూడా మనకు పాఠమున్నది.

ప్రియుడు ప్రియురాలిని చూడగోరుచున్నాడు. ఆయన వచ్చినపుడు మన ముఖము ఎలా ఉంటుంది ? ఆయనకు స్తుతి చేయుట ఈవులనిచ్చుట ముఖమునకు మనోహరము కలుగజేస్తాయి. (కీర్తన 147:1, ఫిలి. 4:18)

**3. 15-17వ. షూలమ్మితీ - ప్రియునిపైనే మనసు :-**

15-17వ. ఇంటివారు కనిపించుచున్నారు. అన్నల శోధన ఉంది. పూత పట్టిన ద్రాక్షాతోటను గుంట నక్కలు పాడుచేస్తున్నాయి. అన్నల ద్రాక్ష తోటలు చెడిపోయినవి. వారు తొందర చేస్తున్నారు. అయినను ఆమె మనస్సు వాటి పైకి మరలలేదు. తన ప్రియుని మీదనే మనసు నిలిపింది. నా ప్రియుడు నా వాడు అన్నది.

రెండవ సహస్రాబ్దిలో అబ్రహాము, సహోదరుడైన లోతు లోకములోనికి వెళ్ళినను, తనకు పాదము పట్టునంత భూమి లేక పోయినను, ప్రభువు మీదనే అబ్రహాము మనసు నిలిపాడు. ఎవని సన్నిధిని నేను జీవించుచున్నానో అని ఆది. 24:40లో అన్నాడు.

ఆయన రాకడ నపేక్షించుచూ ఎదురు చూచాడు. పునాదులు గల పట్టణంకై ఎదురు చూచాడు. (హెబ్రీ 11:10).

## 3వ. అధ్యాయము

విభజన :-

**1. 1-5వ. పరుండి ప్రియుని వెదకిన షూలమ్మితీ.**

**2. 6-11వ. సొలొమోను ఘనత లెక్కపెట్టని షూలమ్మితీ.**

**1. 1-5వ. పరుండి ప్రియుని వెదకిన షూలమ్మితీ.**

1-2వ.1లో వెదకితిని, 2లో వెదకుదును అంటున్నది ప్రియురాలు. వెదకితిని అంటే గత అనుభవము. వెదకుదును అంటే రాబోవుకాల అనుభవము. పాత నిబంధనలో నమ్మకమైన దేవుని బిడ్డలు ఇదే చేశారు. నీ స్వరము వినిపించు ప్రభువా నీ దాసుడు ఆలకించుచున్నాడు. ఆజ్ఞ ఇమ్ము అని వెదకినారు. (1సమూ. 3:10) ఆయన స్వరాన్ని వినడం మంచిది. వినాలి విధేయత చూపాలి. కీర్తన 45:10. కుమారీ ఆలకించుము. ఆలోచించి చెవి యొగ్గుము. ప్రభువు స్వరము వినుటకు మనకు బైబిలు గ్రంథము ఉన్నది. పూర్వపు విశ్వాసులకు సంపూర్ణమైన లిఖిత వాక్యం లేకపోయినా ప్రభువును వెదకారు. (యెష. 34:16) వెదకినా కనబడలేదు. అంటే వెదకినా అర్థము

కాని లేఖనాలు ఎన్నో ఉన్నాయి. అర్థము చేసుకోలేము. అయితే కనుగొనలేనని వెదకడం మానలేదు. మనము వెదకుతూనే ఉండాలి.

3వ. ఆమె పట్టణమంతా తన ప్రియుని కొరకు వెదకింది. కావలి వారు కనబడ్డారు. మీరు నా ప్రాణ ప్రియుని చూచితిరా ? అని అడిగింది. వారి దగ్గర జవాబు లేదు. వారు ఆయనను చూచి యుండలేదు. దేవుని వర్తమానాన్ని యోసేపు దర్శనము ద్వారా చూడగలిగాడు. మందల కాపరులైన తన అన్నలు కావలి వారే గాని దేవుని విషయాలలో సరైన అవగాహన లేని వారు. గాన జవాబులేని వారుగా ఉండిరి. దర్శనము ద్వారా జవాబు పొందని ఏలీ, సౌలు వంటి కావలివారిని మూడవ సహస్రాబ్ది చివరలో చూడగలము.

మనము ఆయనను సంపూర్ణముగా అర్థము చేసుకోవాలి (పర. 5:9-16) అపుడే ఆయనను గూర్చి ఇతరులకు చెప్పగలం. ఈ కాపరులు విచారణ చేయలేదు (యిర్మీ. 23:2) గొర్రెలు చెదరి పోతున్నాయి (9,11 వచనాలు) అందరు అపవిత్రులు (13,14వ) ప్రవక్తల, కాపరుల, కావలివారల జీవితాలు మారలేదు. మందిరాన్ని కాపాడలేకపోయారు. ప్రక. 3:16లో లవొదికయ సంఘపు దూతతో ఉమ్మివేయ నుద్దేశిస్తున్నాను అంటున్నాడు.

కొంతమంది కాపరులను చూస్తే జీవితంలో పవిత్రత లేదు. యెహె. 4:17లో 390 దినాలు ఒక ప్రక్కనే పడుకొని మనుష్యమలముతో రొట్టెలు కాల్చుకొని తినాలి అని ప్రభువు చెప్పాడు. నేను అపవిత్రమైన దానిని ఎన్నడు ముట్టలేదని యెహెజ్కేలు చెప్పగానే గోవుల మలముతో కాల్చుకో మన్నాడు. యెహెజ్కేలు జీవితంలో అపవిత్రత ఎన్నడూ లేదు. కొంతమంది యెహెజ్కేలు వలె నమ్మకమైన ప్రవక్తలు కాపరులు ఉన్నారు.

దావీదు నమ్మకమైన కాపరి (1సమూ. 17:35) కడుపు నింపుకొను కాపరులు, గొర్రెలను దోపుడుకు అప్పగించు కాపరులు కలరు. (యెహె.

34:2,8) కావలి వాడా రాత్రి ఎంతవేళ అయినది ? ఉదయమునగును, రాత్రి అగును (యెష. 21:11-12). ఆయన వచ్చినపుడు ఉదయములాగా కొందరికి వెలుగు, రాత్రి లాగా కొందరికి చీకటి. నమ్మకమైన కాపరులు కాలముల నెరిగి యితరుకు తెలుపు వారై వుండాలి.

4వ. ప్రియురాలు ప్రాణ ప్రియుని చూచింది. వారికున్న కొద్ది లేఖనములలో ప్రభువును చూచినవారు కలరు. ప్రార్థనలో వెదకిన వారు కలరు. తన్ను వెదికే వారికి ఆయన దొరుకుతాడు. ఆమెకు దొరకగా నేనతని వదలిపెట్టక పట్టుకొంటిని, నా తల్లి ఇంటికి నన్ను కనినదాని అరలోనికి తీసికొని వచ్చితిని అంటున్నది. ప్రియురాలు వదలిపెట్టక పట్టుకుంది. మనము ప్రభువును ఎన్నిసార్లు వదిలాము. ఫిలి. 3:12 పట్టుకోవాలి. ఆయన మనలను విడువడు ఎడబాయడు (యిర్మి. 31:3, హెబ్రీ 13:4)

ఉదా : యోనా యెహోవా సన్నిధిలో నుండి పారిపోయాడు. యోనా. 1:3,10, 2:4. ఏలియా కూడా యెహోవా సన్నిధి నుండి వెళ్ళాడు. 1 రాజు 17:1; 19:4,8 అయినా యెహోవా వారిని వెన్నంటియున్నాడు. ఆయనను పట్టుకున్నట్లు ఉన్న లోతు చిట్టచివరకు ఆయనను విడిచాడు (ఆది. 13:4) అబ్రహామును విడిచి వేరై పోయాడు. అయినా లోతును ప్రభువు చివరి వరకు వదలలేదు.

ఆమె ప్రియుని వదలిపెట్టలేదు. అటువంటి మనసు ప్రియ ప్రభునిపై మనకుందా ? తల్లి ఇల్లు, కన్నదాని యర సంఘానికి సాదృశ్యాలు. హెబ్రీ. 10:23-25లోను మనము మన ప్రభువును, ప్రభువు బిడ్డల సహవాసమును సంఘమును వదలిపెట్టవద్దని హెచ్చరిక ఉంది.

5వ. యెరూషలేము కుమార్తెలారా అంటున్నది వీరు కలతపరచేవారు (4వలైను) షూలమ్మితీని లేపుచున్నారు. ప్రభువు నుండి మనలను దూరపరచే

వారు, కలవరపరచే వారు ఉన్నారు. దావీదు యుద్ధభూమిలో ఉన్న అన్నలను కలవడానికి వచ్చాడు. గొల్యాతు విషయము వారితో ప్రస్తావించాడు. అన్నలు దావీదును ఏమేమో అన్నారు. కాని దావీదు వారినుండి తప్పించుకొని వెళ్ళాడు. (1స. 17:30) చిన్న వాడైనా సంపూర్ణ విశ్వాసము కలిగి ఉన్నాడు. కలతపడలేదు దావీదు చివరకు గొల్యాతును హతమార్చాడు. కలతపరచే వారు ఉన్నా ప్రభువు పని మనము చేయాలి.

**2. 6-11వ. సొలొమోను ఘనతను లెక్కచేయని షూలమ్మితీ.**

6వ. ధూమ స్థంభములవలె అరణ్య మార్గముగా వచ్చు ఇది ఏమి ? సొలొమోను యొక్క ఆకర్షణ ఏమి ? పరిమళ వాసన, ఆత్మీయముగా ప్రభువైన క్రీస్తు మన ప్రియుడు. మన ప్రభువు లాంటి వారిని (అబద్దపు క్రీస్తులను) అపవాది తయారు చేస్తాడు. ఇక్కడ వచ్చు సువాసన తన ప్రియుని యొక్క గోపరసము కాదు. ఇది లోక ప్రియుని (అబద్ధక్రీస్తు) సువాసన. అపవాది సంపూర్ణముగా నకిలీ సువాసనలతో శోధిస్తాడు.

7-8వ. మంచము చేయించుకున్నాడు. ఇది లోకమిచ్చు విశ్రాంతికి సూచన. అయితే ప్రభువు శాంతిని మీకనుగ్రహించి వెళ్ళుచున్నాను. నా శాంతినే మీకనుగ్రహించు చున్నాను. లోకమిచ్చునట్లుగా నేను మీకనుగ్రహించుట లేదు అంటున్నాడు. (యోహా. 14:27).

10వ. ధూమ్ర వర్ణ వస్త్రము మెత్తలు చేయబడ్డాయి. నీలి ధూమ్ర రక్త వర్ణ వస్త్రముతో కాదు. అనగా నీలి వర్ణము లేదు. రక్త వర్ణము లేదు. ఆకాశరంగు అనగా దైవత్వము లేదు. రక్తము అనగా పాపక్షమాపణ లేదు. ధూమ్ర వర్ణము అనగా రాజరికమున్నది. దైవత్వము, పాపక్షమాపణ లేని రాజరికము. అలాంటి దృశ్యాల ద్వారా ఆమెను వేరు ప్రియుడు ఆకర్షిస్తున్నాడు, గాని ఆమె ఎన్నడు వెనుకకు తిరిగింది కాదు. యెరూషలేము కుమార్తెలు దానిని అలంకరించారు.

లోకమంతయు మనుష్యుల అలంకరణల చేత నిండినది. వాటి ద్వారా మనము ఆకర్షించబడ కూడదు.

11వ. సొలొమోను రాజును చూచుటకు అందరికి పిలుపు ఇవ్వబడింది. కిరీటం కూడా ధరించారు (పర. 6:8లో అప్పటికి సొలొమోను 60 మందిని పెండ్లి చేసుకున్నాడు) ఈయన సంతోషముగా వస్తున్నాడు గాని ఈమెకు వీటన్నిటి విషయమై సంతోషము లేదు. మత్త. 11:28,29. ప్రభువు విశ్రాంతి సంపూర్ణమైనది. ప్రక. 16:13.

3వ అధ్యాయాన్ని ఆదాము నుండి మూడవ సహస్రాబ్దితో పోల్చి చూచిన యెడల మోషేను అపవాది రాజరికంతో శోధించాడు. మోషే పుట్టిన వెంటనే రాజకుటుంబములో పెంచబడ్డాడు. ఆనాటి ఫరోకు కుమార్తె మాత్రమే ఉంది. ఆమెకు పిల్లలు లేరు. మోషేను పెంచుకున్నది. పెద్దవాడైన ఫరో చనిపోతే ఫరో కుమార్తె రాణిగాను, ఆ తర్వాత మోషే ప్రపంచము నేలు చక్రవర్తికాగల అవకాశము ఉంది. కాని మోషే దేవుని ఇంటిలో నమ్మకమైనవాడు (హెబ్రీ 11:23,27) ఐగుప్తు ధనం కాని, భోగం కాని, రాజరికంగాని లెక్కచేయక ఐగుప్తును విడిచిపోయాడు. కారణం ఈ రాజరికంలో దైవత్వము లేదు పాప క్షమాపణ లేదు.

ఒకవేళ మోషే శోధనకు లొంగిన యెడల కనానుకు ప్రజలను నడిపించు వాడుకాడు. రక్షకుడైన యేసు బెత్లెహేములో పుట్టుట నజరేతులో పెరుగుట యెరూషలేములో చంపబడుట మొదలగు లేఖనాలు నెరవేరక ఉండును. షూలమ్మితీని సొలొమోను తన రాజరికము ద్వారా శోధించినా ఆమె ఆ శోధనకు లొంగలేదు. మన తీర్మానము ఏమి ?

# 4వ. అధ్యాయము

వచనముల విభజన - 6+5+5=16వ.

1\. 1-6 వచనములు : ప్రియుడు ప్రియురాలిని గూర్చి పలుకుట
(మన విషయమై ప్రభువు ఇచ్చు సాక్ష్యముతో పోలిక)

2\. 7-11 " : లెబానోను విడిచి సింహ వ్యాఘ్రగుహలపై పయనించిన షూలమ్మీతీ.
(బబులోను గ్రీకురాజుల కాలంలోని భక్తులకు పోలిక)

3\. 12-16 " : మూయబడిన ఉద్యానవనమైన షూలమ్మీతీ.
(బబులోను చెరకాలములోని భక్తులకు పోలిక)

4వ అధ్యాయములోని విషయాలు 4వ సహస్రాబ్ది కాలముగా పోల్చుకుందాము.

సౌలు క్రీ.పూ. 1050 - 1010 వరకు పరిపాలించాడు. (40 సం॥)
దావీదు క్రీ.పూ. 1010 - 970 " " (40 సం॥)
సొలొమోను క్రీ.పూ. 970 - 930 " " (40 సం॥)

ఆ తరువాత రెహబాము కాలంలో రాజ్యము రెండుగా చీలింది. తరువాత ఇశ్రాయేలీయులు (10 గోత్రముల వారు) క్రీ.పూ. 732, 721లో అష్షూరుకు చెరగా వెళ్ళిరి. యూదా వారు క్రీ.పూ. 606, 597, 586లో మూడు విడతలుగా బబులోను చెరకు వెళ్ళిరి. యూదావారు చెరనుండి వచ్చిన తర్వాత అన్యరాజుల క్రిందనే ఉన్నారు.

యూదావారిని బబులోనువారు క్రీ.పూ. 606 నుండి 536 వరకు, మాదీయ, పారశీకులు 536 నుండి 330 వరకు గ్రీకులు 330 నుండి క్రీ.పూ. 30 వరకు రోమీయులు క్రీ.పూ. 30 నుండి క్రీ.శ. 490 వరకు పరిపాలించారు. ఈ రాజ్యాలను సింహము, ఎలుగుబంటి, పులి క్రూరమృగాల పోలికగా దానియేలు తన దర్శనములో చూచాడు. (దాని. 7అ.)

ఈ అధ్యాయములో 7-11 వచనాల వరకు గతించిన బబులోను, గ్రీకుల రాజ్యాల చరిత్ర 12-16 వచనాల వరకు బబులోను చెరకాల చరిత్ర కనిపిస్తుంది.

**I. 1-6వ. ప్రియుడు ప్రియురాలిని గూర్చి పలుకుట:**

1వ. కన్నులు : నీ దేహమునకు దీపము కన్నే గనుక కన్ను తేటగా ఉంటే దేహమంతయు వెలుగుమయమై ఉండును (మత్త. 6-22). మన శరీరమంతా పవిత్రముగా ఉండాలంటే ప్రాముఖ్యమైనది కన్నే. ఈమె కన్నులు గువ్వ కన్నులు. అంటే నిష్కపటమైన కన్నులు. ఆమె చూపులు నిష్కపటమైనవి. మన చూపులు నిష్కపటంగా ఉండాలి. చూపులు చాలా ప్రాముఖ్యమైనవి. 10సం.ల క్రితము మనము చూచిన చెడు చూపులు కూడ గుర్తుకు వచ్చి మన జీవితాన్ని పాడుచేస్తాయి. కాబట్టి ఎంతో జాగ్రత్తగా ఉండాలి.

ఆమె ముసుగు గుండా చూస్తుంది. ముసుకు విధేయతకు గుర్తు. చూపుకు ముందు విధేయతను గూర్చి చెప్పాలి. హెబ్రీ 5:8. ఆయన (క్రీస్తు) విధేయత నేర్చుకున్నాడు. విధేయత చూపడంలో ఆయన మనకు మాదిరి. మన జీవితానికి ఆయన జీవితము మార్గదర్శం. సంఘములో పురుషులు ఉన్నపుడు స్త్రీ ముసుగు వేసుకోవాలి. ఇది విధేయతకు గుర్తు. వాక్యానికి లోబడాలి. మనలను చూచి ఇతరులు విధేయత నేర్చుకోవాలి.

వెంట్రుకలు : గిలాదు పర్వతము మీద మేకల మందను పోలి ఉన్నవి. ఆమె తల వెంట్రుకలు నల్లనివి. ఎందుకంటే మేకలు నల్లగా ఉంటాయి. నల్లని వెంట్రుకలు యువనకాల బలమునకు గురుతు. యవన బలమును ప్రభువు సేవలో వాడాలి.

గిలాదు పర్వతము : ఈ పర్వతము యొర్దాను నదికి ఆవల కన్పిస్తుంది. ఈ భాగంలో మనష్షే అర్ధగోత్రము, గాదు, రూబేను గోత్రాలు మొత్తం

రెండున్నర గోత్రముల వారున్నారు. కనానులో ప్రవేశించునపుడు మాకు మందలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ మేపుటకు పచ్చిక ఎక్కువగా ఉన్నదని ఇక్కడ నిలిచి పోయారు.

2వ. పలువరుస కత్తెర వేయబడినది. కత్తెర వేయబడినట్టుగా ఉన్న పలువరుస ముఖానికి చాలా అందాన్నిస్తుంది. కత్తెర వేయబడిన మాట తీరు ఆత్మీయ సౌందర్యాన్ని ఇనుమడింప జేస్తుంది. మాట యందు తప్పనివారు తమ జీవితంలో లోపం లేనివారై ఉంటారు అని యాకోబు అంటున్నాడు. (యాకో. 3:2)

3వ. పెదవులు ఎరుపు నూలును పోలియున్నవి. మన పెదవులు ఎప్పుడైనా తప్పి పోగలవు. గనుక పెదవులకు ఎరుపు రంగు అంటే ప్రభువు రక్తముతో నిత్యము పెదవులు కడుగుకోవాలి. నా పెదవులు అపవిత్రమైనవి అని విలపించిన యెషయా పెదాలను బలిపీఠం మీద ఉన్న ఒక నిప్పుకారుతో ఒక దేవదూత పవిత్రపరచాడు. (యెష 6:5-7)

4వ. కంఠరము అనగా మెడ. ఆమె మెడను దావీదు యొక్క జయ సూచకమైన గోపురములతో పోల్చుచున్నాడు. దావీదు యుద్ధానికి వెళ్ళినపుడు జయించి తెచ్చిన డాలులు, కవచాలను జయసూచకాలుగా గోపురాల మీద వ్రేలాడదీస్తారు. అనగా ఆమె మెడపై నున్నది, జయ సూచకాలుగా నున్నందున ఆమె జీవితం జయ జీవితంగా ఉంది..

విజేతల మెడకు పతకాలు (మెడల్స్) వ్రేలాడుతాయి. ఆత్మీయులమైన మన కంఠములు జయసూచకాలను కలిగి ఉన్నాయా ? 100,200 కాదు, 1000 డాల్లు వ్రేలాడే గోపురము అనగా 10X100=1000 గనుక పది అంతల సంపూర్ణమైన జయ జీవితానికి గుర్తుగా ఉంది. సంఘాలతో ప్రభువు మాట్లాడుతూ (ప్రక. 3:21) నేను జయించి నా తండ్రితో కూడా ఆయన

సింహాసనమందు కూర్చున్న ప్రకారము జయించు వానిని నాతో కూడా నా సింహాసనమందు కూర్చుండనిత్తును అన్నాడు. పౌలు తన గెలుపు యొక్క నిశ్చయతను వ్యక్తం చేశాడు. నా కొరకు నీతి కిరీటం ఉన్నది అన్నాడు. (2తిమోతి 4:8)

5వ. ఇరుకుచములు పాలను సూచిస్తున్నవి. పాలు దేవుని వాక్యము. ఆమె దగ్గర సమృద్ధియైన పాలు ఉన్నాయి. అనగా మనము వాక్యమును సమృద్ధిగా కలిగి ఉండాలి. బైబిలులోని ఏ గ్రంథాన్ని గూర్చియైనా చెప్పగలిగే అవగాహన కలిగి ఉండాలి. సొలొమోను కాలంలో యూదులు పాత నిబంధన గ్రంథంలో కనీసం (1) ధర్మశాస్త్ర గ్రంథాలు (2) కీర్తనల గ్రంథము (లూకా 24:44) అను రెండు గ్రంథాలను సంపూర్ణముగా చెప్పగలిగేవారు.

మనకు పాతనిబంధన క్రొత్త నిబంధన అను రెండు గ్రంథములు ఉన్నవి. మన జీవితంలో కూడా వాక్యాన్ని గూర్చిన పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలి.

తల్లిపాలు బిడ్డకు బలము. ఆరోగ్యము తల్లి పాలలో సూక్ష్మక్రిములు చంపే శక్తి కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. తల్లి జింక యొద్ద పిల్లలు పవిత్రమైన పాలు త్రాగినట్లు ప్రభువు యొద్దనే పవిత్రమైన వాక్యాన్ని మనము నేర్చుకోవాలి. సమృద్ధిగా వాక్య నేర్పు కలిగి ఉండాలి. ఈ ఐదు వచనాలలో ఈమెలో ఎలాంటి లోపము లేదు. 1. పవిత్రత గలది, విధేయత గలది. 2. మాటయందు తప్పనిది. 3. నిత్యము పెదవులను పవిత్ర పరచు కొనునది. 4. జయజీవితము గలది. 5. వాక్యమును నేర్చుకొన్నది.

6వ. గోపరస పర్వతాలకు, సాంబ్రాణి పర్వతాలకు నేను వెళ్ళుదును అంటున్నది. గోపరసం అనగా భోళం చేదు అని అర్థము. సాంబ్రాణి కూడా చేదైనదే. శ్రమానుభవమూ చేదైనదే. క్రీస్తు యేసు సిలువ శ్రమల అనుభవము

అనగా సంఘము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరంలో అనుభవించుచున్నాను అని పౌలు కొలస్సై. 1:24లో పేర్కొన్నాడు. పైనున్న ఐదు అనుభవాలేగాక క్రీస్తు కొరకు శ్రమలను అనుభవించుటకు సిద్ధముగా నున్నది.

క్రీస్తునందు విశ్వాసముంచుట మాత్రమే గాక ఆయన పక్షముగా శ్రమపడుటయు మనకనుగ్రహింపబడినది అని ఫిలి. 1:30 సూచిస్తుంది. ఈ వచనం ఒక విశ్వాసి శ్రమలనెదుర్కొనేందుకు సైతం వెనుకాడని సంసిద్ధతను సూచిస్తున్నది. విశ్వాసి ! నీ ఆత్మీయ జీవితమును గూర్చి ప్రభువు ఏమి పలుకుచున్నాడు ?

**2. 7-11వ. షూలమ్మితీ ప్రయాణము :**

7వ. ప్రియుడు నీవు అధిక సుందరివనియు నీయందు కళంకమేమియు లేదని చెప్పుచున్నాడు. చెరకాలంలో దానియేలును గూర్చి " దానియేలు నీవు బహు ప్రియుడ"వని దాని. 9:23 లోను 10,11లోను దేవుడు చెబుతున్నాడు. దానియేలు లోపము లేనివాడని దాని. 6:22లో ఉన్నది. నా దేవుని దృష్టికి నేను నిర్దోషినిగా కనబడితిని అన్నాడు. మనమెలాగు ?

8వ. ప్రాణేశ్వరీ అని ఈ అధ్యాయంలో 6 సార్లు, 5వ అధ్యాయంలో 1వ వచనంలో ఒక పర్యాయము మొత్తం 7 సార్లు పిలుచుచున్నాడు. ప్రభువును నమ్మిన బిడ్డలు ఆయనకు ప్రాణం వంటివారు. తన ప్రాణమిచ్చి వారిని కొన్నాడు. గనుక ప్రాణము కంటే గొప్పవారు.

లెబానోను విడిచి పర్వత శిఖరాల నుండి సింహాల, పులుల గుహలు గల కొండపై నుండి క్రిందకు చూచెదవు అన్నాడు. ప్రియునికి తన ప్రియురాలు తనను విడచి దూరముగా ఏదో పర్వతముల వైపు వెళ్ళిపోయినట్లుగా ప్రియుడు

తిరిగి నా యొద్దకు రమ్మని పిలిచినట్లుగా చూస్తున్నాము. ఆ సింహము బబులోను రాజ్యానికి, పులి, గ్రీకు రాజ్యానికి సూచనగా ఉంది. 4వ సహస్రాబ్ది క్రీ.పూ. 606 నుండి 536 వరకు యూదులు బబులోను వారి చెరలో ఉండిరి. క్రీ.పూ. 330 నుండి 30 వరకు గ్రీకుల క్రింద పరిపాలించబడిరి.

యూదా జనాంగాన్ని వారి పాపమునకు ప్రతిఫలముగా బబులోనుకు పంపించిన తరువాత వారు చెరలో పశ్చాత్తాపపడి తిరిగి దేవుని వైపు తిరుగుట ద్వారా నీయందు కళంకమేమియు లేదు. తిరిగి రమ్ము అని దేవుడు ఆహ్వానించుచున్నాడు.

9వ. ఒక్క చూపుతో నా హృదయమును వశపరచుకొంటివి. మత్తయి. 6:22 ప్రకారం కన్ను తేటగా ఉంటే దేహమంతా వెలుగుమయము, అనగా పవిత్రమైనదై దేవుని హృదయమును వశపరచుకొనుచున్నది. నీ హారములలో ఒక దానిచేత వశపరచుకొంటివి. సామె. 1:8,9 బోధ కంఠమునకు హారము వలె ఉన్నది. అలాగైతే నీ హారము అనగా నీ బోధ ఎలాగున్నది. ప్రభువుకు ప్రీతికరముగా ఉండాలి.

10వ. మధురమైన ప్రేమ ద్రాక్షారసముకన్న సంతోషకరమైనది. అనగా ప్రియురాలు శ్రేష్టమైన ప్రేమ చేత ప్రేమించుచున్నది. 1 యోహా. 3:16. మన సహోదరుల కొరకై ప్రాణము పెట్టబద్ధులమై ఉన్నాము. ప్రియురాలు సహోదరుడుగా ఉన్న ప్రభువుకై ప్రాణము పెట్టుటకు సిద్ధముగా ఉన్నది. మండుచున్న వేడిమిగల గుండంలో ఆహుతి కావడానికి ఇష్టపడిన షద్రకు, మెషకు, అబెద్నగో వంటి వారిని మనము బబులోను చెరకాలంలో చూచుచున్నాము. అటువంటి సాక్ష్యపు వాసన ప్రభువుకు పరిమళ వాసనగా ఉన్నది.

11వ. పెదవులు తేనియ లొలుకుట, నాలుక క్రింద తేనె, పాలు ఉండుట. తేనె, పాలు వాక్యమునకు సాదృశ్యము. పవిత్రమైన వాక్యము చేత మన నోరు

నింపబడవలెనని భావము. నీ వస్త్రముల సువాసన అనగా చక్కని ప్రవర్తన గలది అని అర్థము. శ్రమల కాలంలో భక్తులు పవిత్రమైన జీవితం జీవించిరి అని అర్థము. బబులోను చెర నుండి బయటికి వచ్చి యూదయకు గవర్నరుగా ఉండి మందిరము పునాది వేసి ముగించిన జెరుబ్బాబేలు ఎజ్రా. 1:8లో షేష్బజ్జరు అని పిలువబడు చున్నాడు. ఆ పేరుకు శ్రమలలో సన్న నార వస్త్రములు అని అర్థము. శ్రమల మధ్యను తెల్లని వస్త్రాలు అనగా పవిత్రత కలిగి జీవించెను. ప్రక. 7:14లో కూడా చక్కని ప్రవర్తనకు పటంగా ఉన్నాయి. అంటే చక్కని ప్రవర్తన కలిగి ఆమె ఉన్నదని ప్రియుని వర్ణన. ప్రక. 3:4,5 గల వస్త్రాలు, జయజీవిత వస్త్రాలు కలిగి మనము ఉండాలి.

### 3. 4:12-16వ. మూయబడిన ఉద్యానవనమైన షూలమ్మితీ.

12వ. ఉద్యానవనము, జలకూపము మూయబడినవి. అనగా ప్రియురాలు చెరలో ఉన్నదిగా కనిపిస్తుంది. ఎక్కడ బడితే అక్కడకు వెళ్ళుటకు వీలులేదు. బబులోను చెరలోనున్న యూదా వారికి సాదృశ్యము.

13వ. నీ చిగురులు దాడిమ వనము : దాడిమ అనగా దానిమ్మ 6:11లో చిగురు వచ్చాయి. తర్వాత పూత, పిందెలు, ఫలములు వస్తాయి. మంచి దాడిమ ఫలాలలో ఉన్నన్ని ఫలాలు ఏ ఫలంలో ఉండవు. వెయ్యి కంటే ఎక్కువగా ఉంటాయి. అనగా ఆమె జీవితంలో ఫలవంతమైన కాలము రాబోవుచున్నది.

వింతైన శ్రేష్ఠ ఫల వృక్షములు : మన జీవితంలో ఎన్నో ఫలాలు కలిగి ఉండాలి. జిహ్వా ఫలం (హెబ్రీ. 13:15) సేవా ఫలం, ప్రేమా ఫలం, ఆత్మ ఫలం కలిగి ఉండాలి (ఫలముల వివరాలకై 16వ వచన వ్యాఖ్యానం చూడండి).

14వ. జటామాంసి, కుంకుమ : మొదలగునవన్నీ నిర్గ. 30:34,35లో

పరిమళ ద్రవ్యములుగా నున్నవి. చెరలో నున్నను పరిమళము గల వ్యక్తిగా నున్నది.

15వ. ప్రవాహజల కూపము : 12వ వచనంలో మూయబడినది. కాని ఇపుడు ఉధ్యాన జలాశయము, ప్రవాహజలకూపము, ఆమెలో నుండి జలాలు వస్తాయి. ఆమె ఆత్మ వాక్యములతో నింపబడి ప్రవహించే అనుభవంలో ఉన్నది. అనేకులు బోధతో నిండి (అపో. 5:28) తరువాత ఖండాంతరాలు తిరిగారు.

16వ. పరిమళములు వ్యాపింపజేయుడి; ఉద్యానవనమునకు గాలి రావడం పుష్పముల పరిమళ వాసన వ్యాపింపజేస్తుంది. కాని ఉత్తర వాయువు, దక్షిణ వాయువు దేనిని సూచించుచున్నది ?

ఉత్తర దిక్కు మహారాజు పట్టణమైన సీయోను పర్వతము రమ్యమైన ఎత్తుగల చోట ఉంచబడి సర్వభూమికి సంతోషకరముగా ఉన్నది. (కీర్తన 48:2) యెష. 14:13లో తేజో నక్షత్రము దేవుని నక్షత్రాలకు పైగా ఉత్తర దిక్కున సభా పర్వతముపై కూర్చుందును అన్నాడు. అనగా దేవుడు ఉత్తర దిక్కున ఉన్నాడని భావము. ప్రపంచ పటములో ఉత్తర దిక్కు పై భాగము కాగా దక్షిణ దిక్కు క్రిందుగా ఉండును. ఉత్తరము అనగా పై నుండి ఆకాశ మహాకాశాలకు పై నుండి దేవుడు గాలిని పంపును. ఇది దేవుడు పంపబోవు పరిశుద్ధాత్మను సూచించును. (అపో. 2:1).

ముందుగా ఉత్తర దిక్కున పై నుండి దేవుడు తానే 2000 ఏండ్ల క్రితము దిగివచ్చాడు. లోకానికి దేవుడనని నిరూపించుకుని, మానవ పాప పరిహారానికి బలియై సమాధి చేయబడ్డాడు. ఆలాగైతే ఉత్తర దిక్కు తండ్రియైన దేవుడు కుమారుడైన దేవుడు పరిశుద్ధాత్మ దేవునికి గుర్తు. పునరుద్ధాన బలము ద్వారా క్రీస్తు తిరిగి భూమి నుండి పైకి పరలోకానికి వెళ్ళాడు. భూమి నుండి

పైకి వెళ్ళుట దక్షిణవాయువుకు సూచన. దక్షిణ వాయువు వేంచేయుట పునరుద్ధాన శక్తికి సాదృశ్యము. కొల 3:1. మీరు క్రీస్తుతో కూడా లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి. భూసంబంధమైన వాటి మీద మనసు పెట్టుకొనకుడి. దక్షిణవాయువు విసరుట ఆత్మీయ భూసంబంధమైన వాటి మీద మనసుంచక పైనున్న వాటిని వెదకుటకు సాదృశ్యము. దేవుని యొద్ద నుండి పరిశుద్ధాత్మను క్రీస్తు తాను వెళ్ళిన పది దినములకు పంపాడు. పై నుండి బలముగా వీచు గాలి పరిశుద్ధాత్మ దిగివచ్చినట్లు అపో. 2:1-2లో చూడగలం. యోహా. 15:26 ప్రకారం ఆయన క్రీస్తును గూర్చి సాక్ష్యము చెప్పుచు లోకమును ఒప్పుకొన జేస్తాడు. ఎఫె. 1:13 ప్రకారం నమ్మినపుడు ఆత్మచేత ముద్రిస్తాడు. 4:28-30 ప్రకారం మనలో పాపం కనిపించిన ఆత్మ దుఃఖపడుతాడు. 5:18 ప్రకారం ఆత్మపూర్ణులమై ఉండాలి. ఉత్తర గాలిచే నింపబడవలెను.

యిర్మి. 6:2లో ఉత్తర దిక్కు నుండి కీడు వచ్చునని వ్రాయబడినది. బబులోను రాజు ఉత్తర దిక్కు నుండి యెరూషలేము పైకి వచ్చాడు. ఉత్తర దిక్కున అపవాది కూడా ఉన్నట్లు యెష. 14:13 నుండి తలంచగలము. ప్రభువు సెలవుతో యోబును అపవాది శోధించినట్లు మనలను కూడా శోధించును. ఆర్థిక సమస్యలతో, ఆరోగ్య సమస్యలతో గాలిచేత పూలు వాడిపోయినట్లు మనలను ప్రభువు అపవాది ద్వారా నలుపగలడు. పుష్పము నలిగినపుడే దాని సువాసన వెదజల్లబడు తుంది. శ్రమలలోనే మన సువాసన వెదజల్లబడుతుంది.

క్రీస్తు దేవునికి పరిమళ సువాసనగా ఉండుటకు తన్ను తాను బలిగాను, అర్పణగాను అప్పగించుకొనెను. (ఎఫె. 5:2). మనము దేవుని పోలి నడచుకొన వలెనని ఎఫె. 5:1లో ఉంది. మన జీవితాలు దేవునికి బలి చేయబడినపుడు మన నుండి పరిమళ సువాసన వెదజల్లబడుతుంది. ఆది. 22లో ఇస్సాకును అబ్రహాము బలిగా అర్పించాడు. ఇస్సాకు కూడా తన్ను తాను అర్పించు

కొనుటకై ఇష్టపడ్డాడు. పరిశుద్ధాత్ముని రాక ద్వారా భూలోకంలో పెంతెకోస్తు నాడు సంఘం ఏర్పడింది. సంఘం అనేక శ్రమల ద్వారా పరిమళ వాసనను వ్యాపింపజేసింది. కొలస్సై 1:24లో క్రీస్తు సంఘము కొరకై పడిన పాట్లలో కొదువైన వాటిని నా వంతు నా శరీరం నందు సంపూర్ణము చేయు చున్నాను అని పౌలు అన్నాడు. సంఘానికి శ్రమలు ఉన్నవి. వాటి ద్వారానే మన పరిమళ వాసన వ్యాపించునని చూడగలం.

నా ప్రియుడు తన ఉద్యాన వనమునకు వేంచేయును. గనుక ఈ వచనం సంఘకాలమైన తరువాత జరుగబోవు ప్రభువు రెండవ రాకడను సూచించుచున్నది. ఆ సమయానికి ప్రభువుకిష్టమైన ఫలములు మనము కలిగిన వారమై ఉండాలి. ఫలములు. (1.) ఆత్మఫలము గల 5:22. ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశా నిగ్రహము. ఇలాంటి అన్ని రకాలైన గుణములు కలిగి జీవించిన జీవితమే ఆ ఫలము. (2.) వెలుగు ఫలము ఎఫె. 5:9,(3.) నీతిఫలము ఫిలి. 1:11, (4.) సువార్త ఫలము. కొల. 1:6, (5.) సత్కార్యాల ఫలము. కొల. 1:11, (6.) సేవాఫలము 1 తిమో. 6:2, (7.) జిహ్వాఫలము. హెబ్రీ. 13:15.

పై ఫలములేవైనా నీకు లేనట్లయితే ప్రభువు తన రాకను ఇంకను ఆలస్యము చేయుచుండగా ఆ ఫలములను సంపాదించుకొందువు గాక.

తన కిష్టమైన ఫలములు కలిగి ఉండుట అనగా దేవునికి అనుకూలమైన సజీవయాగముగా మన శరీరములను సమర్పించుట రోమా. 12:1 శరీరమందు జీవించు మిగిలిన కాలం మనుజాశలను అనుసరించి నడుచుకొనక ప్రభువు ఇష్టానుసారముగా నడుచుకొనుట. 1 పేతురు 4:2.

# 5వ. అధ్యాయము

వచనముల విభజన - 8+8=16వ.

1. 1-8 వచనములు : ఉద్యానవనానికి ఏ తెంచిన ప్రియుడు - నిద్రించిన ప్రియురాలు
(మొదట రాకడలో ఈ లోకానికి వచ్చిన ప్రభువు - నిద్రించిన నులివెచ్చని సంఘానికి పోలిక)
2. 9-16 " : ప్రియుని సంపూర్ణముగా ఎరిగి వర్ణించిన ప్రియురాలు
(చక్కని ఎదుగుదల గల సంఘానికి పోలిక)

**<u>1:1-8వ. ఉద్యానవనానికి ఏతెంచిన ప్రియుడు</u>**

**<u>నిద్రించిన ప్రియురాలు</u>**

1వ. నా ఉద్యాన వనమునకు నేను ఏతెంచితిని. ఇది మన ప్రభువు మొదటి రాకడకు గుర్తు. ఉద్యానవనము అనగా సంఘము. నా జటామాంసి నా గంధ వర్గములను కూర్చుకొనుచున్నాను. జటామాంసి అనగా జిగురు. సిలువకు సూచన. సిలువ వేయబడుట చేదైన అనుభవము. జిగురు చేదుగా ఉంటుంది. గంధ వర్గములు అనగా భోళము మొదలైనవి. సమాధికి సూచన. సిలువ సమాధి ద్వారా సంఘము ఏర్పడినది. జటామాంసి సువాసన గలది. జటామాంసి, రసము ద్వారా చేయగలిగిన మరి కొన్ని పదార్థములే గంధ వర్గములు. ప్రభువైన యేసుక్రీస్తు సిలువ, భోళము చేదైన అనుభవము. ఆయన శరీరము గాయపరచబడిన అనుభవము. జటామాంసిలో నుండి రసం కారగా గంధవర్గములు తయారయినట్లు, ఆయన శరీరంలో నుండి రక్తం కారగా సిలువ సువాసన వెదజల్లబడింది. నైవేద్యబలి, దహనబలి దేవునికి ఇంపైనవి. అన్ని బలులు ప్రభువే.

నా సఖులారా అంటే మనము అని అర్థము. మనము తేనెను తేనె పట్టును లెస్సగా పానము చేయాలి. తేనె వాక్యమునకు గుర్తు. తేనెకంటే దేవుని వాక్యం మధురం. కీర్తన 19:7-10 ఆయన లేఖనములు యదార్థమైనవి. లేఖనములు అనగా ధర్మశాస్త్రము, మరియొక పేరు శాసనములు. ఇంకొక పేరు ఉపదేశాలు. అవి హృదయాన్ని సంతోషపెట్టగలవు. ఆయన న్యాయ విధులు సత్యమైనవి, న్యాయమైనవి. వాటిని భుజించాలి, పానము చేయాలి. అవి తేనె కన్న మధురమైనవి. వాటి ద్వారా మేలు పొందాలి. హెచ్చరిక పొందాలి.

క్షీరము అనగా పాలు. హెబ్రీ 4:12 మీరు పాలు మాత్రమే త్రాగువారు అన్నాడు. పాలను బిడ్డలు ప్రేమించినట్లు మనము దేవుని వాక్యాన్ని ప్రేమించాలి, త్రాగాలి. ఆయన బిడ్డలమైన మనం వాక్యమనే పాలు త్రాగాలి. 1 పేతురు 2:1-3.

ద్రాక్షారసము : ప్రభు రాత్రి భోజన సందర్భముగా చిట్టచివరిగా ఆయన ద్రాక్షారసము పానము చేశాడు. నన్ను జ్ఞాపకము చేసుకొనండి అన్నాడు. ఇది సహవాస జీవితానికి, ఆయన జీవితానికి సాదృశ్యము. ఆయన చేసిన కార్యాలు తలపోసి ఆరాధించాలి.

2వ. నేను నిద్రించితినే గాని నా మనసు మేలుకొని ఉన్నది. ఆమె నిద్రించిన ప్రియురాలిగా కనబడుచున్నది. ప్రక. 3:20 బట్టి సంఘాలలో అనేక మంది నిద్రిస్తూ తలుపు వేసినట్లు కనబడుతున్నది. వారి మధ్య ప్రభువు లేడు. సంఘాలలో ఇలాంటి పరిస్థితులు ఉండకూడదు. లవొదికయ సంఘము వారు నిద్రించారు.

1. థెస్స 5:6లో ఇతరుల వలె నిద్రపోక అని ఉంది. అయితే ప్రియురాలు నిద్రపోతూ ఉంది. మెలుకువగా ఉండమంటున్నాడు. (1 థెస్స 5:6) నిద్రమత్తుల వలె ఉండకుండి. (ఎఫె. 5:14) నిద్రించుచున్న నీవు మేల్కొనుము

అంటున్నాడు. ఎఫెసు సంఘములో ఆత్మీయమైన నిద్రకూడా ఉంది. తలుపు తీయమనుచు నా ప్రియుడు తలుపు తట్టు చున్నాడు. (ప్రక. 3:10) అయినా తలుపు తీయలేదు.

3వ. నేను వస్త్రము తీసివేసితిని. వస్త్రము అనగా సాక్ష్యము (ప్రక. 19:10) ప్రక. 16:16 మనము హెచ్చరిక కలిగి ఉండి వస్త్రము కాపాడుకోవాలి లేకుంటే దిగంబరులముగా ఉండగలము.

4వ. తలుపు సందులో నా ప్రియుడు చెయ్యి ఉంచాడు. కానీ, ఆమె తలుపు తీయలేదు.

5వ. నా ప్రియునికి తలుపు తీయ లేచితిని. ఆఖరుకు తలుపు తీయుటకు లేచింది. అంతలో ప్రియుడు వెళ్ళాడు. ఆయన తలుపు తట్టి వెళ్ళిపోయాడు. అవును ప్రియులారా తలుపు తీయుటకు ఇదే అనుకూల సమయము. గడచిన సమయము తిరిగి రాదు. వెంటనే తలుపు తీయాలి.

ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చాడు. వారు తలుపు వేశారు. లవొదికయ సంఘము తలుపు తీసి ఆహ్వానించుట లేదు. పదిమంది కన్యకలు సిద్ధపడ్డారు. బుద్ధిలేని వారికి నూనె లేదు. అంటే పరిశుద్ధాత్మ కార్యము జరుగ లేదు. (మత్తయి 25:1-13).

పెండ్లి కుమారుడు ఆలస్యము చేయగా అందరు నిద్రపోయారు. నిద్ర నుండి సిద్ధపడినవారు లేచి దీపాలు సవరించుకొని లోపలికి వెళ్ళిరి. ఆయన ప్రకాశించే సమయంలో నీవు మేల్కొని ఉండాలి. (ఎఫెసి. 5:14) నిద్రించు చున్న ఆత్మీయులు మేల్కొనాలి. 2సమూ 11:2లో దావీదు యుద్ధానికి పోక నిద్రపోతున్నాడు ఎన్నో నష్టాలు తదుపరి పొందాడు.

6వ. అంతలో అతడు వెళ్ళిపోయాడు. పిలిస్తే పలుకలేదు. కావలివారు

ఆమెను కొట్టి గాయపరిచారు. నిద్ర ఈమె జీవితములో ఉంది. అంటే లోకము పాపము ఈమె జీవితంలో ఉంది. యూదావారు అంటే స్తుతించవలసిన వారు. కాని, వీరిలో స్తుతిలేదు. అందుకే ఆయన పలుకలేదు. సంఘములో నిద్రించు చున్నవారు పలురీతిలుగా నేటికిని గాయపరచబడుచున్నారు.

7వ. వస్త్రము దొంగిలించిరి అని ప్రియురాలు అంటున్నది. అనగా దిగంబరి. ప్రకటన 3:17. ఆత్మీయ జీవితంలో పాపం కలిగి ఉన్నది. సంఘములు కూడా తలుపు తీయకపోతే వారందరి జీవితాలు నిద్రలో ఉన్నాయని భావము. ప్రక. 3:17-19 లవొదికయ సంఘం గురించి దిక్కుమాలినవాడవు, దరిద్రుడవు, గుడ్డివాడవు, దిగంబరివి అంటున్నాడు. ఇలా మనము ఉండకూడదు. బట్టలు ధరించాలి అనగా సత్క్రియలు కలిగి ఉండాలి.

8వ. యెరూషలేము కుమార్తెలు ఆమెకు సహకరించలేదు. ఆటంకాలు చెప్పేవారు. ఆత్మీయులు ఇలాంటి స్థితికి దిగజారకూడదు. దేమా ఈ లోకమును స్నేహించాడని చూస్తాము ( II తిమో. 4:10).

**2. 9-16వ. ప్రియుని సంపూర్ణముగా ఎరిగి వర్ణించిన ప్రియురాలు**

9వ. వేరు ప్రియునికన్న నీ ప్రియుని విశేషమేమని ఆమెను ప్రశ్నించారు. నీ దేవునికి ఇతర దేవుళ్ళకు తేడా ఏమి అని సంఘాన్ని కూడా ప్రశ్నిస్తారు. ఆమె 10-16 వచనాలలో జవాబు చెప్పింది.

ప్రియుని సంపూర్ణముగా వర్ణించింది. శిరస్సు, వెంట్రుకలు (11వ.) నేత్రములు. (12వ.) చెక్కిల్లు, పెదవులు (13వ.) కరములు (చేతులు) కాయము (శరీరము) (14వ.) కాళ్ళు (15వ.) నోరు. (16వ.) ఎలాంటివో తెలిపింది. తలతో ప్రారంభించి కాళ్ళ వరకు ప్రియుని గూర్చిన అవగాహన ఆమెకుంది.

ఆమె ప్రియుడు విశేషమైనవాడు. మన దేవుడు మహాదేవుడు (తీతు2:13)

పరమదేవుడు (ద్వితి. 10:17) సర్వాధికారియైన దేవుడు (రోమా 9:5) నిజమైన దేవుడు (1యోహా. 5:20). నీ దేవుని గూర్చిన సంపూర్ణ అవగాహన కలిగి యున్నావా ?

10వ. ధవళ వర్ణుడు, రత్న వర్ణుడు. ధవళ వర్ణుడు అనగా తెల్లనివాడు. తెలుపు పవిత్రతకు గుర్తు. ప్రతి మానవునిలో లోపముంది. కాని ఈయన ఏడాగు ఏ మచ్చలేనివాడు. పదివేల మందిలో అతడు శ్రేష్ఠుడు.

రత్న వర్ణుడు. కలువరిలో కార్చిన రక్తానికి సూచన. పాపాలకు బలియైన వారు లేరు. మన ప్రభువు చెప్పే వాడు చేసేవాడు హెబ్రీ. 9:22. పాపం పోవా లంటే రక్తం చిందించాలి. ఎరుపు రంగు మన ప్రియుని రక్తానికి సూచన. మన అందరి కొరకు రక్తం కార్చాడు.

11వ. శిరస్సు అపరంజి వంటిది. అపరంజి అంటే శ్రేష్ఠమైన బంగారం. బంగారము దైవత్వానికి సాదృశ్యము. మానవ గుణాలు కనిపిస్తున్నాయి. మానవుడుగా వచ్చిననూ పాపమనేది లేదు. ఈయన పవిత్రమైన దేవుడే.

తల వెంట్రుకలు నల్లనివి. నలుపు బలానికి గుర్తు. ఆయన బలవంతు డయిన దేవుడు. నిండు యవ్వనము కలిగినవాడు. ఆయన వృద్ధుడయ్యే వాడు కాడు. నిత్యయవ్వనుడు. నేనే అల్ఫా, ఒమేగ అనగా ఆది అంతము అని చెప్పాడు. మన ప్రియుడు అందమైనవాడు.

12వ. నేత్రములు గువ్వ కన్నులు. పావురము నిష్కపటమైనది. పవిత్ర మైనది. లోకంలో దేవుళ్ళు అనే వారిలో పవిత్రత కనిపించడం లేదు. గువ్వ కన్నులే పరిశుద్ధమైనవి. పైగా అవి పాలతో కడుగబడినవి. రెండంతలు పరిశుద్ధత సంపూర్ణ పరిశుద్ధుడని భావము.

13వ. అతని చెక్కిల్లు పరిమళ పుష్పస్థానము. రమ్యమైన వర్ణన. పెదవులు పద్మములు. పెదవుల నుండి వచ్చు మాటలు ఆశ్చర్యకరమైనవి. ఆయన

దయగల మాటలకు అందరు ఆశ్చర్యపడ్డారు. మన మాటలు కీడు, తొందర కలిగిస్తాయి.

14వ. అతని కరములు తార్షీషు రత్న భూషితమైన స్వర్ణ గోళములు. శరీరము దంతపు పని. చేతులు బంగారు. తండ్రియైన దేవునికి దహన బలిగా నైవేద్యముగా క్రీస్తు అర్పించు కోవడం వలన దంతపు పనిగా కనబడు చున్నది.

15వ. కాళ్ళు మట్లయందు నిలిపిన చలువ రాతి స్థంభములు. అనగా స్థిరమైనవాడు. ప్రభువు పునాది స్థిరము. వైఖరి లెబానోను పర్వతముతో సమానము. లెబానోను, హెర్మోను నిత్యము మంచు చేత కప్పబడి ఉంటాయి. ఈ మంచు ఐక్యతకు గురుతు. 133వ కీర్తన ప్రకారము సంపూర్ణముగా ఐక్యపరచువాడు.

16వ. అతని నోరు అతి మధురం. ఆయన వాక్యము నిజముగా మధుర మైనది. రమ్యమైన మాటలు ఆయనను గురించి కనబడుచున్నవి. అన్ని రీతుల ప్రేమించదగినవాడు. యెరూషలేము కుమార్తెలారా నా ప్రియుడు, నా స్నేహితుడు ఈయనే.

## 6వ. అధ్యాయము

వచనముల విభజన - 3+4+6=13వ.

1. 1-3 వచనములు : యెరూషలేము కుమార్తెల ప్రశ్నలకు ప్రియురాలి జవాబు (సంఘ పరిచర్యకు పోలిక)
2. 4-7 " : ప్రియురాలిని వర్ణించిన ప్రియుడు (సంఘ విషయమై ప్రభువు ఇచ్చిన సాక్ష్యముతో పోలిక)
3. 8-13 " : ప్రియుని మాటలు - ప్రియురాలి మాటలు (సంఘ ప్రత్యేకత, పవిత్రత ప్రకటన ఫలములతోపోలిక)

**1. 1-3వ. యెరూషలేము కుమార్తెల ప్రశ్నలకు ప్రియురాలి జవాబు.**

1వ. స్త్రీలలో అధిక సుందరివగుదానా అని పిలువబడుతుంది. 1:8లో సుందరి అని 1:14లో సుందరివి, సుందరివి అని 2:11,13లో సుందరవతి అని 4:1లో సుందరివి, సుందరివి అని 4:7లో అధిక సుందరివి అని 5:9లో, 6:1లో స్త్రీలలో అధిక సుందరివగు దానా అని 7:6లో అతి సుందరమైన దానవు అని కనబడుతుంది. ప్రారంభము నుండి ఆమె సౌందర్యము క్రమేణా హెచ్చుగుట మనము గమనించగలము. ఆత్మీయులమైన మనకు ఇది గొప్ప హెచ్చరిక. మన సౌందర్యము దినదినము ఎక్కువ కావాలి. 2కొ. 3:18 ప్రకారము మహిమ నుండి అధిక మహిమను పొందుచు ప్రభువు అయిన ఆయన ఆత్మ ద్వారా ఆయన పోలికగా మార్చబడాలి.

పదివేల మందిలో మన ప్రభువును గుర్తించవచ్చు. కాబట్టి దినదినము అధిక సౌందర్యము గలవారమై ఆయన పోలికగా మార్చబడాలి. 6:4లో నీవు తిర్సా పట్టణమువలె సుందరమైన దానవు. యెరూషలేమంత సౌందర్యవంతురాలవు అన్నాడు. ఆమె అందము ఎంత ద్విగుణీకృతమవుచున్నదో చూడండి. మన అందము ఎలా ?

2వ. నీ ప్రియుడు ఎక్కడికి పోయెను.

(1) నా ప్రియుడు ఉద్యాన వనమునకు, (2) పరిమళ పుష్పస్థానమునకు, (3) పద్మములను ఏరుటకు, (4) మందలను మేపుటకు పోయెను. ప్రియుడున్న స్థానములోనే మనము ఉండాలి.

(1) ఉద్యానవనము సంఘమే. సహవాస జీవితము. విశ్వాసి యొక్క ప్రారంభమైన అంశము.

(2) పరిమళ పుష్పస్థానము : ఎఫెసి 5:1 క్రీస్తు మిమ్మును ప్రేమించి పరిమళవాసనగా ఉండుటకు తన్ను తాను అర్పణగాను, బలిగాను అప్పగించు

కున్నాడు. ఆ పరిమళ సువాసన క్రీస్తు ఆఘ్రానించుట మన ఆరాధన స్తుతి జీవితాన్ని సూచించుచున్నది.

(3) పద్మములు ఏరుకొనుటకు ఆత్మల సంపాదనకు గుర్తుగా ఉన్నది. ఎన్నడు దున్నని బీడు భూములు దున్నుట, విత్తుట, పైరుకోయుట, సువార్త ప్రకటించి ప్రార్థించి ఆత్మలను సంపాదించుటకు గుర్తు.

(4) మందలను మేపుటకు సంఘములోని సహోదరులకు వాక్య ఆహారమును అందించుట. గొఱ్ఱెపిల్లలను మేపుట, గొఱ్ఱెలను కాయుటకు గుర్తు. యోహా. 21:15-17వ.లో వివరములు చూడగలము.

లూకా 17:7లో మీలో దున్నువాడు, మేపువాడైన దాసుడు యజమానునికి పరిచర్య చేయువాడుగా ఉండాలన్నాడు. 1. యజమానుని పరిచర్య స్తుతి ఆరాధనగాను 2. దున్ను పరిచర్య సువార్త ప్రకటన ఆత్మల రక్షణ కార్యముగాను 3.మేపు పరిచర్య సంఘమును కాచి పోషించు పరిచర్యగాను చూడగలము.

3వ. మనము కూడా పద్మములలో ప్రియుని ద్వారా మేత మేయువారమై ఉండాలి. మనము మన ప్రియునికి చెందినవారముగా ఉండాలి.

**2. 6:4-7వ. ప్రియురాలిని వర్ణించిన ప్రియుడు.**

4వ. తిర్సా ఇశ్రాయేలువారి రాజు నివసించు సౌందర్యవంతమైన పట్టణము. యెరూషలేము యూదా రాజులు నివసించు అందమైన పట్టణము. ప్రియురాలు ఈ రెండు పట్టణములంత సుందరము, సౌందర్యము కలది.

టెక్కెముల నెత్తిన సైన్యమువలె భయము పుట్టించు దానవు. టెక్కెము అనగా బ్యానర్లు పట్టుకొని సైన్యమువలె సాగివెళ్ళుట సువార్త సేవను సూచిస్తున్నది. సువార్త సేవా వివరములు 10వ వచనములో వివరముగా చూడగలము.

5,6,7 వచనాలను వివరముగా 4:1-2 వచనాలలో ధ్యానించితిమి. ఆమె

చూపు, తలంపు, పలుకులలోని పవిత్రతను తెలియజేయుచున్నది. ఆ విధేయత (ముసుగు) ద్వారా ఫలము (దాడిమ ఫలము) పొందుటను సూచించుచున్నది.

**3. 6:8-13వ. ప్రియుని మాటలు - ప్రియురాలి మాటలు :**

8వ. సొలోమోనుకు 60 మంది రాణులు, 80 మంది ఉపపత్నులు, లెక్కకు మించిన కన్యకలు కలరు. కాని షూలమ్మితీ వీరిలో ఒకతె కాదు. ప్రత్యేకమైనది.

9వ. వారందరికంటే షూలమ్మితీ ప్రత్యేకముగా ఉన్నట్లు లోకములో మన జీవితానికి ప్రత్యేకత ఉండాలి. లెక్కకు మించిన కన్యకలున్నప్పటికీ వారివలె కాక షూలమ్మితీ ప్రత్యేకముగా ఉంది. ఆయన మన జీవితములో ప్రత్యేకతను చూడాలని కోరుచున్నాడు.

నా పావురము నా నిష్కలంకురాలు. పావురము అంటే (మత్తయి10:16) నిష్కపటమైనది. ఎఫె. 5:25ను బట్టి కళంకమైనను, ముడుత అయినను ఉండకూడదని కోరుచున్నాడు.

పావురము నిష్కలంకమైనదే కాక ఇంకా ఎన్నో విధాలుగా బలికి కూడా పనికి వస్తుంది. దేవుని కొరకై తన్ను తాను అర్పించడానికై సిద్ధముగా ఉంది. షూలమ్మితీ తన్ను తాను అర్పించుకొనుటకు ఇష్టముగా ఉంది. మనము కూడా రోమా. 12:1-2 ప్రకారము సజీవయాగంగా సమర్పించుకోవాలి. రోమా 8:36 ప్రకారం దినమెల్ల వధించబడిన వారమైనట్లు ఉండాలి. అన్ని విషయాలలో ఆయనకు ఇచ్చువారముగా అప్పగించుకొనే వారముగా ఉండాలి.

పావురమును సమాధాన బలిగా అర్పిస్తారు. అనగా దేవునితో నిత్యము సమాధానము కలిగి ఉండాలి. పాపపరిహారార్థ బలి, అపరాధ పరిహారార్థ బలిగా కూడా అర్పిస్తారు. ఇశ్రాయేలీయులు ఉదయం, సాయంత్రం బలి అర్పించేవారు. అనగా మన జీవితాలు నిత్యం దేవునితో సమాధానంగా ఉండాలి.

ఆమె తల్లికి ఒకతే కుమార్తె. తల్లి అనగా సంఘమే, సంఘానికి బిడ్డలముగా వుండాలి. సంఘములో అన్ని విషయాలలో, సహవాసంలో, సేవలో ఎప్పుడూ ఉండాలి. ముద్దుబిడ్డ అనగా ప్రియమైన వారముగా వుండాలి. అపో.కార్య. 2:42 వీరు ఎడతెగక ఉన్నారు.

పైన ఉన్న 60 మంది రాణులు 80 మంది ఉపపత్నులు ఈమెను చూచి ధన్యురాలు అంటారు. మనము పవిత్రముగా జీవిస్తే, అనేకులు మనలను ధన్యులు అంటారు. బైబిలులో ఎన్నో ధన్యతలు ఉన్నాయి. ప్రకటనలో 7 ధన్యతలు ఉన్నాయి. ప్రక. 16:16 వస్త్రాలు కాపాడుకొనేవాడు ధన్యుడు. 22:7లో వాక్యము గైకొనువాడు ధన్యుడు. ఈమె వాక్యమును గైకొంటున్నది పవిత్రతను కాపాడు కొంది. గనుక ధన్యురాలు అంటున్నారు. మన జీవితంలో మనము ఆలాగు ఉంటున్నామా ?

10వ. సంధ్యారాగము అనగా చీకటిని పోగొట్టు వెలుగు. అంటే భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చేది. ఉదయము సూర్యుడు చూడముచ్చటగా ఉంటాడు. ఈమె తన జీవితంలో ముచ్చటైన జీవితాన్ని చూపిస్తుంది. సూర్యుడు వెలుగును చూపిస్తాడు. అలాగే మనము వెలుగు దీపములవలె సత్క్రియలను లోకానికి చూపించువారముగా ఉండాలి. ఆయన నీతి సూర్యుడై తన రెక్కల క్రింద ఆరోగ్యము కలుగజేస్తాడు. (మలాకి. 4:2) సంధ్యారాగము చూపట్టే భావాలన్ని మనలో ఉండాలి.

చంద్రబింబమంత అందము చంద్రునికి అందము సూర్యుని నుండే వస్తుంది. సూర్యుని వెలుగు చంద్రుని మీద పడకపోతే చంద్రునికి వెలుగులేదు అందము లేదు. అలాగే నీతి సూర్యుడైన మన ప్రభువు వెలుగు మనమీద ప్రకాశించకపోతే మనకు వెలుగులేదు. అందము లేదు. ఆమె అందముగా ఉన్నది. గనుక అనేకులు [illegible] అందము గలదానవని అంటున్నారు.

చంద్రునికి అందము రావడానికి సూర్యుని వెలుగు ఎలా కారణమో అలాగే మనమీద ప్రభువు వెలుగుపడాలి. 2కొ. 3:18లో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింప జేయవలెనని మహిమ నుండి అధిక మహిమను పొందుచు దినములు గడచిన కొలది మనము చంద్రునివలె, పూర్ణ చంద్రుని వలె కనిపించాలి. అపుడే అందముగా కనిపించగలం.

సూర్యుని అంత స్వచ్ఛము గలది అనగా పరిశుద్ధతకు గుర్తు. నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై ఉండండి అన్న వాక్యానికి పోలిక. సైన్యముతో పోల్చబడింది. వ్యూహిత సైన్య సమభీకర రూపిణి. అనగా విధి నిర్వహణలో సైనికుని వలె ఉండాలి అని అర్థము. ఆ పనిలో ఉన్న అన్ని కష్టాలు శ్రమలు అనుభవించాలి.

మంచి సైనికునివలె వ్యూహములో ఉండాలి. (2తి. 2:2) సైన్యము వెళ్ళే క్రమము చెప్పబడింది. క్రీస్తు మత్తి. 26:53లో మాట్లాడుతూ సేనా వ్యూహము గురించి మాట్లాడుచున్నాడు. వ్యూహము అంటే అనేకులుగా కలసి సైన్యముగా ఉండుట, నడచుట, సైన్యము వస్తుంటే భీకరముగా ఉంటుంది.

సైన్యములో ఐక్యత ఉండాలి. విధేయత ఉండాలి. ప్రాణాలు పోయినా వ్యూహితము (గుంపు)గా వెళ్ళితేనే వారికి ధైర్యము వస్తుంది. ఒక్కరిగా వెళ్తే ధైర్యము రాదు. వీరు శత్రువుల మీదికే. మనము కూడా శత్రువుల మీదికే. మన శత్రువులు ఎఫె. 6:10-17లో ఆకాశమండలమందున్న దురాత్మల సమూహాలే కాని శరీరులైన మనుష్యులు కాదు. మనము రక్తమాంసములు గలవారితో పోరాడరాదు.

పర. 6:4 టెక్కముల నెత్తిన సైన్యమువలె ఇలా ఉంటే లోకానికి భయము పుడుతుంది. పాతనిబంధనలో యూదా వారు ప్రయాణములో టెక్కములతోనే వెళ్ళేవారు. ఇలా మనము కూడా వ్యూహిత సైన్య సమభీకర రూపిణిగా ఉండాలి.

11వ. నేను అక్షోట ఉద్యానవనమునకు వెళ్లితిని. పర 6:1లో ప్రియుడు

ఎక్కడికి వెళ్ళాడు ? ఉద్యానవనమునకు (2) ఇక్కడ ఈమె చెట్లు పూతపట్టెనో లేదో చిగురించెనో లేదో చూచుటకు వెళ్ళినది. సంఘములో విశ్వాసులు ఎదుగుచున్నారో, లేదో పూత పట్టారో లేదో పరిశీలించి వారి ఎదుగుదలకు సహాయం చేయాలి. మన జీవితాలలో పూత, కాయలు, ఫలాలు ఉన్నవో లేవో అనే నిత్య పరీక్ష అవసరము.

12వ. పరిచయంలో ఈ వచనము ధ్యానించాము. షూలమ్మితీ రాజ నగరులో పరీక్షింపబడినది.

13వ. రమ్ము అని పిలిచే కేక. ఇక్కడ ప్రభువు రెండవ రాకడలో సంఘమును పిలిచే పిలుపుకు గుర్తు 1 థెస్స 4:17లో బూరధ్వనితో ప్రభువు పిలువగా సంఘము ఎత్తబడుట.

ఆమెలో ముచ్చట పుట్టించునది మహన యీము నాటకము. మహన యీము అను పేరు ఆది. 32:1లో గలదు. రెండు సేనలు అని భావము. మిఖాయేలు, గబ్రియేలు, వీరిద్దరు ప్రధాన దూతలుగా ఉండగా మిఖాయేలుది యుద్ధాలు చేసేపని. గబ్రియేలుది వర్తమానము అందించేది.

ఇక్కడి రెండు పరిచర్యలు మనకున్నవి. (1) సువర్తమానమందించుట (2) ప్రభువు పక్షమున దురాత్మల సమూహముతో పోరాడుట. నాటకంలోని రెండు పరిచర్యలు మనమును కలిగి ఉండి అందరికి ముచ్చట పుట్టించే వారముగా ఉండాలి. ఈమె ప్రభువు రమ్ము అన్న పిలుపుతో ఆయన సన్నిధికి వెళ్ళితే 2 కొరి. 5:10 ప్రకారం క్రీస్తు న్యాయపీఠం ఎదుట ఫలము పొందునదిగా ఉన్నది.

8 వచనము నుండి ఒక్కొక్క వచనము వరుసగా ఆమె ప్రత్యేకత, (8వ) పవిత్రత (9వ) ప్రకటన (సువార్త) (10వ) ఫలములను వెదుకుట (11వ) పరీక్షింపబడుట (12వ) పిలువబడుట (13వ) ఫలము పొందుట గూర్చి చెప్పబడినది. ఈలాగు మనము వరుసగా ఫలింపుదుముగాక. 5,6 అధ్యాయాలలో 5,6 సహస్రాబ్దికాలమైన సంఘకాల భక్తుల చరిత్ర చూచితిమి.

# 7వ. అధ్యాయము

వచనముల విభజన - 6+3+4=13వ.

1. 1-6 వచనములు : షూలమ్మితీ పై ప్రియుని తీర్పు (ఆకాశమండలంలో క్రీస్తు తీర్పుతో పోలిక)
2. 7-9 " : షూలమ్మితీ, ప్రియుని ఐక్యత (సంఘమును క్రీస్తు వివాహమాడుట గొర్రెపిల్ల వివాహముతో పోలిక)
3. 10-13 " : ప్రియునితో పల్లెలకు వెళ్ళుట (పరలోక పట్టణ ప్రవేశంతో పోలిక)

6 వ అధ్యాయము చివరలో తిరిగి రమ్మని పిలుస్తున్నాడు. అనగా సంఘాన్ని ఆకాశమండలానికి పిలువడానికి గుర్తు. 7 అధ్యాయములో 1-6 వచనాలలో సంఘపు ఆకాశ మండల తీర్పు కనబడుతుంది.

**7:1-6వ. షూలమ్మితని గూర్చిన ప్రియుని తీర్పు:**

1-5 వచనాలలో షూలమ్మితీ ప్రతి అవయవమును గూర్చిన తీర్పు ఉన్నది. పాదరక్షలతో మొదలు తలవెంట్రుకల వరకు వర్ణించబడినది. ఇది దేహము వర్ణణ 2కొ. 5-10లో దేహముతో జరిగించినవి, అన్ని తీర్పు తీర్చ బడాలి. ప్రతిఫలం పొందాలి. ప్రతి అవయవము చేసిన క్రియలు తీర్పులోనికి వచ్చునని గమనించి జాగ్రత్తగా ఉండాలి.

1వ. రాజకుమార పుత్రికా ! ముందు అధ్యాయాలలో షూలమ్మితీ బంధింప బడినదిగా సామాన్యురాలిగా కనబడింది. కాని ఇపుడు రాజకుమార పుత్రికగా రారాజును వివాహమాడునదిగా ఉన్నది.

పాదరక్షలు నడక గురించి మాట్లాడుచున్నాడు. అది అందముగా ఉంది.

మన నడక ప్రభువు ఎదుట ఎంత అందముగా ఉన్నదో తలపోయుదుము గాక లోపము లేని జీవితము ఉంటే మంచిది.

పాదాలు కాదు పాదరక్షలు అంటున్నాడు. యెహోషువాతో (యెహో. 5:15) మోషేతో (నిర్గ. 3:5) పాదరక్షలను తీసివేయమన్నాడు. అంటే తీసివేసి నడవమని కాదు. సిద్ధమనస్సు అను పాదరక్షలు (ఎఫెసీ 6:5) ధరించి ఉండాలి. అనగా మోషే నీ మనస్సు తీసివేయి. నేను చెప్పే రీతిగా నడుచు సిద్ధమనస్సు ధరించు అని అర్థము. మీ తలంపులు నా తలంపులు వేరు అన్నాడు. (యెషయా 55:8) నిర్గమ 3,4,5 అద్యాయాలలో మోషే స్వంత మనస్సును దేవుడు తీసి వేశాడు. తర్వాత దేవుని మనస్సును కలిగి మోషే ముందుకు సాగాడు.

దేవుడు మనకు సెలవిచ్చిన తన చిత్తము ప్రకారం నడిస్తే మేలు. ఎఫెసీ 6:15లో సమాధాన సువార్త కొరకైన సిద్ధమనస్సు అని ఉంది. మార్కు 6:8,9లో సువార్తకై వెళ్ళమని ఉంది. ఎక్కడికి వెళ్ళాలి ? యెష 52:7లోను 10:13-15 సేవచేయు వారి పాదాలు వర్ణించబడ్డాయి. తప్పిపోయిన కుమారునికి పవిత్రత అనే జోడు ఇచ్చాడు. అలాగైతే పైన చెప్పిన మన నడక తీర్పు తీర్చబడును.

ఊరువులు అనగా తొడలు : ఆది 24:2-4లో తొడక్రింద చెయ్యి పెట్టి ప్రమాణం చేయమన్నాడు. తొడ ప్రమాణానికి గుర్తు. తొడ బలానికి గుర్తు మనకు దేవునికి మధ్య ఉన్న ప్రమాణాలు ఎలా ఉన్నాయి ? కాపాడామా? లేదా ?

శిల్పకారి ఎవరు ? హెబ్రీ 11:9ని బట్టి క్రీస్తే. దేవుడే ప్రధాన శిల్పకారి. సంఘమును అపోస్తులుల ద్వారా నిర్మించాడు. నీ ఊరువులు అనగా నీ ప్రమాణాలు ఆభరణ సూత్రముల వలె ఆడుచున్నవి. అనగా మనము ఆయన ఆజ్ఞలను సంపూర్తిగా నెరవేర్చాలి.

2వ. నాభీదేశము : అనగా బొడ్డు. కలశము చెంబులాంటిది. బొడ్డు

గుండ్రముగా ఉంటుంది. తల్లికి బిడ్డ పుట్టినపుడు నాభి కోయబడును. అనగా ప్రత్యేకత యెహె 16:4 నాభి అనగా కేంద్రము. మనము ప్రత్యేకముగా ఉండాలి. గనుక మన నాభి వేరుగా ఉండాలంటే కత్తితో కోయాలి. వాక్యమను కత్తితో కోయగా నొప్పి ప్రత్యేకముగా ఉండాలంటే కష్టపడాలి. ద్రాక్షారసము వెలితిగా ఉండకూడదు. ద్రాక్షరసము గాయాలను కడిగేది. గనుక వాక్యమునకు యేసు రక్తమునకు గుర్తు అయిన ద్రాక్షారసము వెలితిగా ఉండకూడదు. వాక్యముతో వెలితి లేకుండా మనలను నింపుకోవాలి.

గాత్రము అనగా కడుపు. గోధుమలతో, పద్మములతో అలంకరింప బడినది. పద్మాలు అలంకరించుట జయమునకు సూచన లోకములో కడుపును మనము జయించాలి. అనేకులకు వారి కడుపే వారికి దేవుడు. ఫిలి. 3:17, జయించే విషయము జాగ్రత్తగా ఉంది. ఈమె ఆత్మీయతను ప్రేమించినది. ఏశావు కడుపు కే ఓడిపోయాడు. హెబ్రీ 12-16,17.

3వ. కుచములు పాలకు సూచన : అనగా సమృద్ధిగా వాక్యము ఉండాలి. ఇరుకుచములు అనగా రెండు నిబంధనలు. రెండు జింక పిల్లలు పాతకొత్త నిబంధనలకు గుర్తు (పర. 4:5లోని వ్యాఖ్యానము చూడుము).

4వ. కంధరము అనగా మెడ. దంతముల చేత చేయబడినది. ఏనుగు దంతము కావాలంటే ఏనుగు చావాలి. ధరించాలి అంటే కొల.3:1 ప్రకారం జయజీవితమునకై మనము చచ్చిపోయినట్లు ఉండాలి. ఫిలి. 3:13 వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికై పరుగెత్తాలి.

నేత్రములు : రెండు నేత్రములు రెండు తటాకములు. ఇంగ్లీషులో Fish Pool అని ఉంది. కన్నుగూర్చి చెబుతూ నీరు గూర్చి చెబుతున్నాడు. అదే కన్నీరు (కన్ను+నీరు) మన జీవితంలో కన్నీరు కార్చే అనుభవము కావాలి. కీర్తన 6:1-6 సేవకై పిల్లలకై కుటుంబముకై సంఘముకై ప్రార్థించుటలో పోరాడాలి.

Fish Pool అనగా చేపలు. సువార్తకై మనుష్యులను పట్టుజాలరిగా ఆత్మలను పట్టుకోవాలంటే కన్నీరు అవసరము. హెబ్రీ 5:7. దిద్దుబాటుకై ప్రార్థన అవసరము. రెండు తటాకాలు అంటే (1) మనకై కన్నీరు కార్చాలి. (2) సేవకై కన్నీరు కార్చాలి. 1 కొరి. 3:13-15 వచనాల ప్రకారము మనము పునాది మీద కట్టిన పని (సేవ) అగ్నిచే పరీక్షింపబడును. పరీక్షలో నిలిచిన ఫలము పొందుదుము. మనము చేసిన పని తీర్పు తీర్చబడుటను సూచించును. నాసిక అనగా ముక్కు. నాసికారంధ్రాలు వాయువును పీల్చుకుంటాయి. ఆది 2:7లో జీవవాయువు ప్రభువు ఊదుట. అనగా ఆత్మచేత నింపబడాలి. అపుడే పైవన్నీ చేయగలము. ఎఫెసి. 4:30, 5:18. ఆత్మను దుఃఖపరచక ఉండాలి. ఆత్మ పూర్ణులమై ఉండాలి.

5వ. నీ శిరస్సు కర్మెలు పర్వత రూపము. స్త్రీకి శిరస్సు పురుషుడు పురుషునికి శిరస్సు క్రీస్తు 1 రాజులు 18లో కర్మెలు పర్వతముపై క్రీస్తు ఘనపర్చబడ్డాడు. మన జీవితంలో ఆయన ఘనపరచబడుచున్నాడా ? శిరస్సు కర్మెలు పర్వత రూపము (గల. 4:17) మన శిరస్సు పూర్తిగా ఆయనదై ఉండాలి. తల వెంట్రుకలు ధూమ్రవర్ణము గలవి అనగా రాజరికానికి గుర్తు. మన క్రియలు జీవితము తీర్పు తీర్చబడును. పని తీర్పు తీర్చబడును.

6వ. పై వన్నియు చెప్పి అతిసుందరమైన దానవు అంటున్నాడు. అది ఆమెకు ఇవ్వబడిన సర్టిఫికెటు. రేపు మనము ఈ ఆకాశమండల తీర్పులో సర్టిఫికేటు పొందగలమా ? అతి మనోహరముగా ఉండగలమా ? 1 కొరి. 3:13-15, II కొరింథీ 5:10.

**2. 7-9వ. షూలమ్మితీ ప్రియుని ఐక్యత :**

ఏడేండ్ల ఆకాశమండల తీర్పు పిదప 1 థెస్స 4:17 ప్రకారము మనము సదాకాలము ఆయనతో ఉందుము. ప్రియుడైన యేసుతో ఐక్యముగా నుందుము.

7వ. తాళ వృక్షమంత తిన్ననిది. చాలా ఎత్తు గలది అని అర్థము. ఇది నీతిగల జీవితానికి గుర్తు. ఇది ఏలాగు ? క్రీస్తు ద్వారానే సాధ్యము (రోమా 3:23-26) మన జీవితాలలో క్రీస్తు ద్వారా తిన్నని అనుభవము ఉండాలి. ప్రక. 19:7-10లో మనకు నీతిక్రియలు అనేవి ఇవ్వబడినవి. ఈ తాళ వృక్షము తిన్ననిది. అనగా ఆమె తాళ వృక్షమంత నీతి గలిగి సిద్ధముగా ఉంది.

8వ. తాళ వృక్షము ఎక్కుదామనుకున్నాడు. దాని యొక్క శాఖలు పట్టు కొందుననుకొంటిని. ఇది క్రీస్తు సంఘము యొక్క ఐక్యతను సూచించును. 1 థెస్స 4:16-18 సదాకాలం ఆయనతో ఉండుట. ద్రాక్షగెలల వలె అనగా ఫలభరితమైన జీవితము కలిగి ఉండుట.

9వ. ఆమె నోరు ప్రియునికి మధుర పానీయముగా ఉన్నది. అనగా భర్త ప్రశంశ కొరకై భార్య సిద్ధముగా ఉన్నట్లుగా ఆమె ఉంది.

**3. 10-13వ. ప్రియునితో పల్లెలకు వెళ్లుట:**

10వ. నేను నా ప్రియుని దానను. నేను నా ప్రియునికి స్వంతమై పోయాను. క్రీస్తు తండ్రి ప్రక్కనే ఉన్నాడు. మనము సంఘముగా శరీరముగా భూలోకంలో ఉన్నాము. ఏడేండ్ల ఆకాశమండల తీర్పు పిదప అందరము కలసి క్రీస్తు దగ్గరే అత్యంత సన్నిహిత సంబంధముగా ఉంటాము.

11వ. పల్లెలకు వెళ్ళుదము అనగా ప్రభువుతో పెండ్లి అయిన తర్వాత వెళ్ళే స్థలము (యోహా. 14:1-6) ఆయన తన నివాసమైన పరలోకానికి తీసుకొని వెళ్తాడు. 2కొ. 5:1-3 స్థిరమైన నివాసము ప్రభువుతో కూడ మనకు ఉన్నది.

12వ. ప్రియురాలి కోరిక పెందలకడలేచి ద్రాక్షవనమునకు వెళ్ళుదము. ప్రియునితో కలసి వెళ్ళాలని కోరిక ఇది ఆదికాండంలో చల్లపూటను మానవునితో దేవుడు కలసి సంచరించాలని కోరిక. వనములలోనికి వెళ్ళుదము.

ఇక్కడ దేవుని కోరిక నెరవేరింది. ఆదికాండంలో చల్లనిపూట అన్నాడు. వనము లోనికి వెళ్ళి చిగురించినవో లేదో వికసించినవో లేదో పూత పట్టెనో లేదో చూతము. మునుపు దూరముగా ఉండి ఈ మాటలు అన్నది. ఇపుడు ప్రియునితో కలసి ఈ మాటలు అంటూ చూచుటకు వెళ్ళుచున్నారు. ప్రేమ సూచనలు ఏమి చూపిస్తుందో ప్రియురాలు.

13వ. పుత్రదాత వృక్షము దాచి ఉంచిన నానా విధశ్రేష్ఠ ఫలములు : పుత్రుని అనుగ్రహించిన వృక్షము. తండ్రియైన దేవుడే తన కుమారుడైన క్రీస్తును అనుగ్రహించాడు. పుత్ర దాత వృక్షము క్రీస్తు పుట్టుకను చూపును. అవి సువాసన ఇచ్చినట్లుగా ఆయన జీవితము సువాసనగా ఉన్నది. ఆయన సిలువలో మన పాప నివారణకై పరిమళ సువాసనగా మారాడు. (ఎఫెసి.5:2) చివరకు క్రీస్తే తండ్రిలో ఐక్యమవుతాడు.

మనలో ఎన్నో శ్రేష్ఠఫలాలు ఉండాలి. సేవాఫలం, జిహ్వాఫలం, ఆత్మఫలం చందాఫలం వీటన్నిటిని బట్టి ఆనందించి ప్రభువుకు చూపువారముగా నుండాలి. ఇలాంటి అనుభవము ఉండాలంటే మనము ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ప్రభువు రాబోవుచున్నాడు. మన సేవ ఫలించిన దానిని బట్టి దేవుడు మనకిచ్చిన నివాస ద్వార బంధముల మీద వ్రేలాడదీయబడి ఉంటాయి.

ఆ ప్రియురాలు ప్రియుని కొరకు దాచి ఉంచిన నానా విధశ్రేష్ఠ ఫలములు అనగా ఆత్మీయముగా ఎన్నో ఫలములు మనమును కలిగిఉండాలి. గలతీ 5:22 ఆత్మఫలము, ఎఫెసీ 5:9 వెలుగు ఫలము, ఫిలిప్పీ 1:11, నీతిఫలము కొలస్సి. 1:6-10 సత్క్రియ అను ఫలము, 1తి. 6:2 సేవాఫలములు, హెబ్రీ 13:15 జిహ్వాఫలము.

క్రీస్తు వచ్చినపుడు ఆ ఫలములు చూచి ఆనందిస్తాడు. కొన్ని పండినవి. అనగా ఆత్మీయముగా పండిన స్థితి. పచ్చివి అనగా ఆయన కొరకు బాగా ఫలించే అనుభవానికి రానివారు.

# 8వ. అధ్యాయము

వచనముల విభజన - 4+3+5+2=14వ.

1. 1-4 వచనములు : ప్రియునితో కలసి తల్లియింట యుండుట.
   (భూమిపై వేయెండ్ల పాలనకు పోలిక)

2. 5-7 " : షూలమ్మితీ అరణ్య మార్గమున వచ్చుట
   (నూతన యెరూషలేము భూమిపైకి దిగివచ్చుటతో పోలిక)

3. 8-12 " : షూలమ్మితీ గతకాల చరిత్ర

4. 13-14 " : ముగింపు.

**1. 1-4వ. ప్రియునితో కలిసి ఉండుట**

1వ. నా తల్లి యొద్ద స్తన్యపానము చేసిన ఒక సహోదరునివలె నీవు నా యెడల నుండిన ఎంతమేలు.

ఆయన క్రీస్తే హెబ్రీ 2:14-17లో అన్ని విషయములో సహోదరుని వంటివాడు కావలసివచ్చెను. ఆమె సహోదరుని వలె ఉండును. మేలు అనుటలో ఏమేలు ఉందో చూద్దాము. హెబ్రి 2:14-17లో పాప నివారణకై బలి అవటానికి రక్తమాంసములు గల దేహమును ధరించుకొని, మరణము యొక్క బలం గలవానిని నశింపచేశాడు. ముందున్న జీవితము పై ప్రధాన యాజకుడుగా ఉన్నాడు. శోధనకు మనము తప్పిపోయేవారము. కాని ఆయన కనికరమును బట్టి శోధనలలో తప్పిపోకుండ సహాయము చేయుచున్నాడు.

హెబ్రీ 4:16ను బట్టి కనికరింపబడి కృపపొందునట్లు సహాయం కొరకు కృపాసనం యొద్దకు వెళ్ళుటకు వీలు దొరికింది.

2వ. ఆయన మనకు మార్గదర్శి విశ్వాసానికి కర్తదానిని కొనసాగించు

వాడు ఆయనే. (హెబ్రీ 12:1-3) నా తల్లి ఇంట చేర్చుదును. పెళ్ళి కుమార్తె ఇల్లు భూలోకమే. ఇది పెండ్లికి పిదప భూలోకములో జరుగు వేయి ఏండ్ల పాలనను సూచించును.

సంభారమిళిత ద్రాక్షారసము అనగా సంభారము అనే వివిధ రకాలైన వాటితో కూడిన ద్రాక్షారసము సంతోషమునకు గుర్తు. (కీ.104:15) దానిమ్మ ఫలము శ్రేష్ఠతకు, శక్తికి గుర్తు. సంపూర్ణ శక్తి వేయెండ్ల కాల పాలనలో ప్రభువు ఇస్తాడు.

3-4వ. ఇక్కడ చివరి సారిగా యెరూషలేము కుమార్తెలు కనబడు చున్నారు. ఇకముందు వచనములలో కనబడరు. వేయేండ్ల కాలములో కూడా ఇశ్రాయేలు వారు ఉందురు. మత్తయి 25లో జనాంగాల తీర్పు నుండి వేయేండ్ల పాలనలో ప్రవేశించిన ఇశ్రాయేలు వారు ఉంటారు. కాని సంఘమైతే ఆయనతో భార్యగా ప్రక్కనే కలసి ఉంటుంది.

**2. 5:7వ. షూలమ్మితీ వచ్చుట**

5వ. తన ప్రియుని రొమ్ముమీద ఆనుకొని అరణ్య మార్గమున వచ్చుట సంఘము క్రీస్తును ఆనుకొని నూతన యెరూషలేముగా పరము నుండి దిగి వచ్చుటను సూచించును. (ప్రక. 21:9-10) సంఘము అరణ్యమున వచ్చునది. అనగా విమోచింపబడినవారు అనగా రక్షింపబడిన వారు ఇశ్రాయేలీయులవలె ప్రయాణ అరణ్య అనుభవము కలిగియుందురు. 40 దినములలో కనాను చేరవలసిన ఇశ్రాయేలీయులు 40 సంవత్సరాలు ప్రయాణము చేశారు. కాని ఆ ప్రయాణంలో బట్టలు పాతగిలలేదు. చెప్పులకు ఏమీ కాలేదు. దేవుడు ఎంతో అద్భుతంగా వారిని నడిపించాడు.

మన ఆధ్యాత్మిక పుట్టుకను మరల జ్ఞాపకం చేస్తున్నాడు. జల్దరు వృక్షము

క్రింద నిన్ను లేపితిని. దానినీడను కూర్చుంటిని. ఆ వృక్షము క్రీస్తే. క్రీస్తు మానుపై వ్రేలాడదీయబడినవాడు. ఆ సిలువ మ్రాను క్రిందనే రక్తప్రోక్షణలోనే మనలను రక్షించి లేపినాడు. నిన్ను కన్న తల్లి (సంఘము) అచ్చటనే ప్రసవ వేదనపడినది అన్నట్లు గలతీయులలో క్రీస్తు స్వరూపమేర్పడుటకు పౌలు ప్రసవ వేదన పడినవాడుగా ఉన్నాడు. గలతీ. 4:19.

క్రీస్తుకు కలిగినంత శ్రమ, వేదన, ఎక్కడ ఎపుడు ఎవరికి కలుగలేదు. విలాప. 1:12 క్రీస్తు శ్రమలు గెత్సెమనె తోటనుండే ప్రారంభమయినది. చిల్ల పెంకువలె అయ్యాడు. ఆదాము పాపము ఈ వేదనకు మూలము (రోమా 8:12) సృష్టికర్త వేదన సంపూర్తి కాబోవుచున్నది. కొల. 1:24 సేవాజీవితంలో మనవంతు వేదన మనకు ఉంచబడినది. ఆత్మల ఫలాలు సంపాదించాలంటే వేదన ఉండాలి.

6-7వ. ఆయన ప్రేమ మరణమంత బలము గలది. ఈర్ష్య పాతాలమంత కఠోరమైనది. నీ హృదయము మీద నన్ను నామాక్షరముగా ఉంచుకొనుము. నామాక్షరము అనగా ముద్ర అని భావము. ఆయన హృదయము మీద ఒక చెరగని ముద్రలాగా మనము ఉండాలి, అనగా ప్రభువుతో సదాకాలము ఉండుటను సూచించు చున్నది. ప్రభువుకు, పెండ్లి కుమార్తెకు ఉండబోవు ప్రేమను ఎవరు తీసివేయలేరు.

### 3. 8-12వ. షూలమ్మితీ గత కాల చరిత్ర

8-10వ. ఆమె తన ప్రారంభ చరిత్రను జ్ఞాపకము చేసుకొనుచున్నది. ఆమె ఇంటివారు, ఆమె విషయమై ఏమి చేయుదమని తలంచినారు. కాని ఇపుడు తన ప్రియుడు ఆమెను తన హృదయంపై ముద్రగా ఉంచుకున్నందున ఆమెకు ప్రియుడైన ప్రభువు గతకాలం ఆమెను కాపాడిన సంగతి ఆమె తలపోసుకొనుచున్నది. దేవదారు మ్రానులు ఆమెకు అడ్డుగా వచ్చాయి. అనగా

ఈలోకపు రాజుల శోధన వచ్చినా ఆమె తన ప్రియుని మీదనే మనసు నిలిపి నందున ఆమె ప్రియుని దృష్టిలో క్షేమము నొందదగినదయింది.

11-12వ. సొలొమోను రాజు తన నగరు నందలి తోటల ద్వారా శోధించెను. అవన్నియు చాలా పెద్దవి. వాటి రాబడి గొప్పది. తన ప్రియుని ద్రాక్ష వనము మాత్రమే తన వశములో ఉంచుకొన్నది. సొలొమోను తనకు ఇవ్వజూపిన తోట రాబడిని సొలొమోనుకే ఇచ్చి వేయుచున్నది. తాను అందులో ఏమైనను ఆశించక ఈలోకమునైనను ఈ లోకములో ఉన్నవాటినైనను ప్రేమించకూడదన్న (1యో. 2:15-17) వాక్య ప్రకారము నడచి ఆ వాక్యాన్ని నెరవేర్చినది.

## ముగింపు

13-14వ. తన సహోదరులతోను, మిగిలిన అందరితోను తన సంబంధము ముగించుకొని తన ప్రియునితో సదాకాలము ఉండబోవుచున్నది. ఆమె స్వరము అందరు వినుట అను ఆమె సేవా జీవితాన్ని ప్రియుడు ఆమెలో చూడగోరుచున్నాడు. ప్రభువు రాకడనపేక్షించు ప్రియురాలైన సంఘముగా ఆమె ఉన్నది. మన అపేక్ష ఎలాగు ?

# టి.పి. వరప్రసాదరెడ్డిగారి ఇతర రచనలు

## 1. విశ్వాస వీరులైన సైలస్ ఫాక్స్, జార్జిముల్లర్, హెండ్లీబర్డ్, అగ్రిప్ప

కెనడా దేశములో జన్మించిన సైలస్ ఫాక్స్ మన దేశమందు జరిగించిన సేవ గొప్పది. జార్జిముల్లర్, హెండ్లీబర్డ్, అగ్రిప్ప అనువారు ఆయన సమకాలికులు గనుక 1996 మే సంవత్సరము నందు ఈ నలుగురు దైవజనుల క్లుప్త చరిత్రలను మొదటిసారిగా ప్రచురించిరి.

## 2. సంఘ చరిత్ర

ప్రభువైన యేసుక్రీస్తు ఏర్పరచుకొనిన అపోస్తలుల ద్వారా స్థాపించ బడిన అసలైన సంఘము, హతసాక్షుల కాలము మరియు వెయ్యేండ్ల చీకటి కాలము గుండా దాటివచ్చెను. ముఖ్యముగా చీకటి కాలమందలి సంఘ చరిత్ర అనేకులకు తెలియదు గనుక క్లుప్తముగా ఈ పుస్తకములో అందించు చున్నారు.

## 3. రూతు గ్రంథము

రూతు గ్రంథములోని నాలుగు అధ్యాయములను విభజించిన తరువాత అందులోని ప్రాముఖ్యమైన అంశములను అందరు అర్థము చేసుకునే రీతిలో విశదపరచియున్నారు. ముఖ్యముగా నాలుగు అధ్యాయము లలో రూతు యొక్క ఆయా స్థితులను గూర్చిన పరిశీలన పట్టికలోని సత్యము మిమ్మును ఆత్మీయముగా బలపరచును.

గమనిక :- పై పుస్తకము కొరకు మీరు సంప్రదించవలసిన చిరునామా మొదటి పేజిలో ఉన్నది.

# పరమగీతము

రచయితయగు సహోదరుడు టి.పి. వరప్రసాదరెడ్డిగారి కలము నుండి వెలువడిన "రూతు గ్రంథము" ఎంతో ఆశీర్వాదకరముగా నుండినదని దైవ సేవకులతో సహా అనేకులు తెలియ జేసిరి. గ్రంథమును విభజించి ప్రతీ అంశమును క్షుణ్ణముగా పరిశీలించుట రచయిత యొక్క ప్రత్యేకత.

పరమగీతములోని మొదటి నాలుగు అధ్యాయములు పాత నిబంధన కాలమునకు సంబంధించినవి; అయిదు, ఆరవ అధ్యాయములు సంఘకాలమునకు సంబంధించినవి; అధ్యాయము ఏడు, ఎనిమిదిలోని దిగువ అంశములు భవిషత్కాలమునకు సంబంధించినవని తెలియజేయు రచయిత -

1. ఆకాశ మండలములో సంఘానికి తీర్పు కాలము

2. వెయ్యేండ్ల కాలము

3. నిత్యకాలమునకు పోలికగా ఉన్నవని స్పష్టపరచు చున్నారు. పరమగీతములో చెప్పబడిన పోలికలను సామాన్య మానవుడు సహితము అర్థము చేసుకొనే రీతిలో, సులభశైలిలో విశదపరచుటకు రచయిత కృషిచేసియున్నారు.

పరమగీతములోని ప్రతి వచనమునకు ఇందులో వ్యాఖ్యానము కలదు. చదవండి; ఇందులోని సత్యములను బోధించండి.

SONGS OF SOLOMON
Rs. 15-00

SUDARSAN PRINTERS
0863 - 2246245